

# నగదు జమ కాలేదా...?

- ఆటో డ్రైవర్లూ.. సచివాలయానికి వెళ్లండి !
- ఫిర్యాదుల స్వీకరణ... ఆపై ప్రత్యేక పోర్టల్‌లో రవాణాశాఖకు బదిలీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు అండగా నిలిచేందుకు 'ఆటో డ్రైవర్ల సేవలో... అనే పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా 17,406 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.26 కోట్లను విడుదల చేసింది. అయితే జిల్లాలో వందల సంఖ్యల్లో అర్హత ఉన్న ఆటో డ్రైవర్లకు ఈ పథకం కింద రూ.15 నగదు ఇంకా వారి ఖాతాల్లో జమ కాలేదు. దీంతో వారిలో అసహనం నెలకొంది. ఈ క్రమంలోనే పథకానికి అర్హత సాధించిన లబ్ధిదారులు వారి పరిధిలోని సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తే... వారు వెంటనే స్పందించి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో కంప్లెయిట్‌ను రైజ్ చేస్తారు. ఆ ఫిర్యాదు నేరుగా రవాణాశాఖ కార్యాలయానికి చేరుతుంది. దీంతో రవాణాశాఖ అధికారులు అన్నీ పత్రాలను పరిశీలిస్తారు. లేని పత్రాలను జత చేయమని చెప్తారు. అనంతరం వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చూస్తారు. ఇంకెందుకు ఆలస్యం.. నగదు జమ కాని ఆటోవాలాలూ త్వరపడండి.

# ఈ-క్రాప్ గడువు పొడిగింపు

- రైతులు సద్వినియోగం చేసుకుంటే సంక్షేమ ఫలాలు

ఉదయగిరి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సెప్టెంబరు నెలాఖరుతో ఈ- క్రాప్ నమోదుకు గడువు ముగియడంతో వేలాదిమంది అన్నదాతలు నమోదుకు దూరమయ్యారు. ఏ ఒక్క రైతూ నష్టపోకూడదని భావించిన ప్రభుత్వం గడువును ఈనెల 25 వరకు పొడిగించింది. అనంతరం రైతుసేవా కేంద్రాల్లో అర్హుల జాబితాను ప్రదర్శిస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.



ప్రతి ఖరీ ఫ్, రబీ సీజన్లలో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బంది చేపడుతుంటారు. వీటి ఆధారంగానే పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే బీమా వర్తింప చేసి పరిహారం అందజేస్తుంది. పంట రుణాలపై వడ్డీ రాయితీని భరిస్తుంది.

**● నమోదు తప్పనిసరి**

రైతులు ఈ-క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలి. జిల్లాలో వ్యవసాయ పంటలు 1,65,721 ఎకరాలు, ఉద్యాన పంటలు 1,18,180, సామాజిక వనాలు 24,737 ఎకరాలు చొప్పున మొత్తం 3,08,638 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు అధికారులు 2,46,727 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేశారు. ఇంకా 61,911 ఎకరాల్లో నమోదు చేయాల్సి ఉంది. ఖాళీగా ఉన్న భూములకు ఎలాంటి పంట సాగు చేయలేదని నమోదు చేస్తారు. వ్యవసాయ సహాయకులు రైతును పొలం వద్ద నిలబెట్టి ఫొటో తీసి యాప్‌లో పొందుపరుస్తారు. అనంతరం రైతు పేరు, పంట రకం, విస్తీర్ణం, సొంతమా... కౌలుకా... నీటి ఆధారమా.. సేంద్రియమా... రసాయనమా...? ఆధార్, ఫోన్ నంబరు తదితర వివరాలన్నీ సేకరించి యాప్‌లో పొందుపరుస్తారు. ఆధార్ ఓటీపీ లేదా వేలిముద్రతో నమోదుకు అవకాశం కల్పిస్తారు.

# ఈ నిషేధం ఇంకెంత కాలం?

- ఫ్రీహోల్డ్ భూములపై ఎటూతేల్చని ప్రభుత్వం
- ఏడాది క్రితం విచారణ పూర్తి... రిజిస్ట్రేషన్లకు బ్రేక్
- 14,834 ఎకరాల దోపిడీ జరిగినట్లు గుర్తింపు
- 83,951 ఎకరాలు సక్రమమేనని నిర్ధారణ
- రిజిస్ట్రేషన్లు జరక్క నిజమైన లబ్ధిదారుల ఇక్కట్లు




**ఎం**కి పెళ్లి సుబ్బిచావు కొచ్చిందన్న చందంగా తయారైంది అర్హులైన ఫ్రీహోల్డ్ భూముల లబ్ధిదారుల పరిస్థితి. వైసీపీ హయాంలో పేదల పేరుతో భారీ భూదోపిడీ జరిగింది. అనర్హులకు కూడా ఫ్రీహోల్డ్ పేరుతో ప్రభుత్వ భూములను కట్టబెట్టారు. ఈ విషయమై కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ ప్రారంభించింది. గతేడాది ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు నెలల్లో రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. జిల్లాలో 98,785 ఎకరాలను ఫ్రీ హోల్డ్ కింద పట్టా భూములుగా మార్చగా, ఆ భూములన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్రీహోల్డ్ లబ్ధిదారుల అర్హతను రీవెరిఫై చేశారు. ఇందులో 14,834 ఎకరాల ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు ఫ్రీహోల్డ్ పేరుతో పట్టా హక్కులు కల్పించారని గుర్తించారు. మిగిలిన 83,951 ఎకరాల ఫ్రీ హోల్డ్ సక్రమంగానే ఉన్నట్లు నిర్ధారించారు. ఈ వివరాలన్నింటినీ సర్వే నంబర్లతో సహా ఆన్‌లైన్ చేసి ప్రభుత్వానికి పంపారు. కానీ ఏడాది గడిచినా ఇంత వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



నెల్లూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఫ్రీ హోల్డ్ అక్రమాలపై ఎటువంటి నిర్ణయం తీసుకోవాలన్నదానిపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ మంత్రుల కమిటీ ఇంత వరకూ ఎటువంటి సిఫార్సులు చేయలేదు. అయితే ఈ ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ ప్రారంభమైనప్పటి నుంచి ఈ భూముల రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిలిపివేసింది. ఈ ప్రభావం నిజమైన లబ్ధిదారులపై పడుతోంది. ఏ భూములు అక్రమమో, ఏ భూములు సక్రమమో అన్నది రెవెన్యూ అధికారులు తేల్చాక కూడా ఇంకా అన్ని భూములపై నిషేధం కొనసాగిస్తుండడం లబ్ధిదారుల ను ఇబ్బందులకు గురిచేస్తున్నది. పట్టా హక్కులు కల్పించాక కూడా పేదలు వారి భూములను కుటుంబ అవసరాల కు విక్రయించుకోలేకపోతున్నారు. ప్రభుత్వం త్వరగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**● పేదల భూముల దోపిడీ**

వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ పేరుతో ఒక జీవోను తీసుకొచ్చింది. దీని ప్రకారం ఎవరైతే అసైన్‌మెంట్ పట్టాలు పొంది ఇరవై ఏళ్ల గడిచి ఇప్పటివారే సాగు చేసుకుంటున్నారో.. అటువంటి వారికి ఆ అసైన్‌మెంట్ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తారు. అలానే చుక్కల భూములకు కూడా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. ఇలా గత ప్రభుత్వంలో జిల్లాలో 98,785 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. అందులో అసైన్‌మెంట్ భూములు 55,447 ఎకరాలు ఉండగా, చుక్కల భూములు 43,271 ఎకరాలు ఉన్నాయి. మరో 67 ఎకరాలు ఈనాం భూములున్నాయి. నిబంధనల ప్రకారం ఫ్రీహోల్డ్ చేసే సమయంలో గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంది. అప్పుడే లబ్ధిపొందుతున్న వ్యక్తి అర్హుడా.. కాదా..? అన్నది తేలిపోతుంది.

**నాడు గ్రామసభలు ఏవీ?**

కానీ ఎక్కడా గ్రామసభలు నిర్వహించలేదు. నిజమైన అసైన్‌మెంట్‌దారులు కాకపోయినా వేల మందికి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించి పేదల భూములు కట్టబెట్టారు. నాడు వైసీపీ నేతలు సాగించిన ఈ దోపిడీకి రెవెన్యూ అధికారులు పూర్తి సహకారం అందించారన్న ఆరోపణలున్నాయి. ఈ అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచారణకు ఆదేశించింది. గతేడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో ఫ్రీహోల్డ్ భూములపై తహసీల్దార్ల స్థాయిలో క్షేత్రస్థాయి విచారణ జరిగింది. ఈ సందర్భంగా 14,834 ఎకరాల భూమిని నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ చేసి అనర్హులకు దోచిపెట్టినట్లు తేలింది. ఇందులో అసైన్‌మెంట్ భూములు 14,553 ఎకరాలు ఉండగా, చుక్కల భూములు 281 ఎకరాలు ఉన్నాయి. ఈ వివరాలన్నింటినీ కలెక్టర్, జేసీ ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేశారు.

# పరిశ్రమల అభివృద్ధికి సహకరించండి

## హైవే పక్కన పొలాల రైతులతో సబ్ కలెక్టర్



మన్నేటికోట రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ హిమవంశీ

ఉలవపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఏర్పాటు కానున్న ఇండోసోలార్ కంపెనీకి భూసేకరణ విషయంలో సహకరించాలని కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ కోరారు. జాతీయ రహదారికి పక్కన ఉన్న పొలాల రైతులతో ఆదివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. హైవే నుంచి 300 మీటర్ల దూరంలో ఉన్న మన్నేటికోట గ్రామ ఉద్యాన రైతులకు సంబంధించిన 50 ఎకరాల భూముల ధరపై రైతులతో చర్చించారు. ప్రభుత్వ రేటును దృష్టిలో పెట్టుకుని, భూసేకరణలో భాగంగా ఎకరా సుమారు రూ.22 లక్షలు పలుకుతుందని సబ్ కలెక్టర్ రైతుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు రైతులు స్పందిస్తూ ఎకరాకు రూ. 50 లక్షల నుంచి రూ.కోటి వరకు ప్రభుత్వం ప్రకటిస్తేనే తాము భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తామన్నారు. ప్రభుత్వం తరుఫున ఫైనల్‌గా రూ.30లక్షల వరకు ధర నిర్ణయించేలా చూస్తానని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ విషయమై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

## కండలేరులో 57.55 టీఎంసీలు

రాపూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 58.46 టీఎంసీల నీరు ఉందని ఏఈ అనిల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 3600 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో, 650 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని అధికారులు పేర్కొన్నారు.

## సోమశిలకు 9, 245 క్యూసెక్కుల వరద

అనంతసాగరం అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఆదివారం ఎగువ ప్రాంతాల నుంచి 9,245 క్యూసెక్కుల వరద వస్తున్న ట్లు అధికారులు తెలిపారు. దీంతో 72.508 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 2,600, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

## నేటి నుంచి వెంకయ్య పర్యటన

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పూర్వ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు సోమవారం నుంచి ఈనెల 9వతేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 1.55 గంటలకు తిరుపతికి చేరుకుంటారని, సాయంత్రం 4 గంటలకు రోడ్డు మార్గాన వెంకటాచలానికి చేరుతారని పేర్కొన్నారు. ఈనెల 9వతేదీ వరకు స్వర్ణభారత్ ట్రస్టులో బసచేస్తారని, ఆ రోజు ఉదయం 11.30 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి బయలుదేరి తిరుపతి మీదుగా హైదరాబాద్‌కు చేరుకుంటారని తెలిపారు.



# వేట సాగక.. పూట గడవక !

- ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మత్స్యకారులు
- బోటు, వలల రాయితీకి గత ప్రభుత్వం మంగళం
- హైస్పీడ్ బోట్లతో దెబ్బతింటున్న వలలు
- జీవనోపాధి కరువై.. ఇతర పనుల్లో గంగపుత్రులు


వివరాలు 4లో...


# రైల్వే ట్రాక్‌లపై ఫ్లైవోవర్ల కల నెరవేరేనా?

- గేటు వేస్తే.. బారులు తీరాల్సిందే !
- నగరంలో తీవ్ర సమస్యగా రైల్వే గేట్లు
- వంతెనల నిర్మాణంలో ముందుకు పడని అడుగు
- రోజురోజుకూ జఠిలమవుతున్న ట్రాఫిక్ సమస్య
- నగర ప్రజలకు ఉపశమనం ఎప్పటికో..?

నెల్లూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అదిగో పులి అంటే ఇదిగో తోక.. అన్న సామెతగా తయారైంది నెల్లూరులోని రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణం. ఒకటి, రెండు కాదు.. సుమారుగా ఏడేళ్లగా రైల్వే బ్రిడ్జిల నిర్మాణం మాటలే తప్ప ఆచరణ కనిపించడం లేదు. గతిశక్తి పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందటే ఈ రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణానికి బడ్జెట్‌ను కూడా కేటాయించింది. అప్పుడప్పుడు అధికారులు సమావేశాలు పెట్టుకొని వెళ్లిపోతుంటారు తప్ప ఫలితం మాత్రం కనిపించలేదు. ఈ ఏడాది జూన్‌లోనే బీవీనగర్, కొండాయపాలెం గేట్ల స్థానంలో బాక్స్ బ్రిడ్జిల నిర్మాణానికి టెండర్లు పిలుస్తామని అధికారులు ప్రకటించారు. కానీ, ఆ గడువు ముగిసి కూడా మూడు నెలలైంది. బీవీ నగర్, కొండాయపాలెం గేట్ల వద్ద బ్రిడ్జిలు నిర్మించాలంటూ కొన్ని దశాబ్దాల నుంచి ప్రజలు కోరుతున్నారు. నగరవాసుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణానికి సన్నాహాలు జరిగాయి. ఆ రెండు చోట్ల మట్టి పరీక్షలు కూడా చేశారు. వంతెన నిర్మాణానికి అవసరమైన మేరకు భవనాల తొలగింపునకు మార్కింగ్ కూడా ఇచ్చారు. కానీ ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఇటీవల మళ్లీ ఈ ప్రయత్నాల్లో కదలిక రాగా, ఈ దఫా ఫ్లైవోవర్లకు బదులుగా బాక్స్ టైప్ బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించారు. పోనీ ఆపైనా ముందుకు సాగుతోందా అంటే అదీ లేదు.

**● వాహనాల బారులు**

రాష్ట్రంలోనే నాలుగో అతిపెద్ద నగరం నెల్లూరు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో ముందు వరుసలో ఉంది. వ్యాపార, వాణిజ్య, పరిపాలనకు కేంద్రం. సుమారు పది లక్షల జనాభా ఉన్న నగరంలో ఇప్పటికీ తూర్పు, పడమర ప్రాంతాలకు వెళ్లాలంటే రైల్వే గేట్లు దాటాల్సిందే. ఒక్కసారి రైల్వే గేటు పడితే ఇక వాహనాలు బారులు తీరాల్సిందే. అందులోనూ ఇప్పుడు మూడో ట్రాక్ కూడా ఆపరేషన్‌లోకి రావడంతో ఒకసారి గేటు పడితే అర్ధగంటపాటు వాహనాలు నిలిచిపోతాయి. దీనివల్ల వాహనదారులకు సమయం వృథా అవుతోంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు నివాసముంటున్న నగరంలో ఇలాంటి దుస్థితి నెలకొనడంపై ప్రజల నుంచి తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.



కొండాయపాళెం గేటు వేయడంతో ఆగిన వాహనాలు

**● ఆ ఒక్కటే దిక్కు..!**

నగరంలో ప్రస్తుతం ఒకేచోట (అయ్యప్పగుడి సర్కిల్ వద్ద) రైల్వే ఫ్లైఓవర్ ఉంది. మాగుంట లేఅవుట్, రామలింగాపురం, విజయమహల్ గేటు, ఆత్మకూరు బస్టాండ్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు ఉన్నాయి. ఇక ప్రధానమైన బీవీనగర్, కొండాయపాలెం గేటు, విజయమహల్ గేటు, రంగనాయకుల పేట వద్ద మ్యాన్యువల్ రైల్వే గేట్లు ఉన్నాయి. వర్షాకాలం వస్తే నీరు రోడ్లపై పారుతుంది. ఆ సమయంలో రైల్వే అండర్ బ్రిడ్జిలు నీటితో నిండిపోతాయి. అప్పుడు రాకపోకలు సాగించడం కష్టమవుతుంది. ఆ సమయంలో అయ్యప్పగుడి ఫ్లైవోవర్ ఒక్కటే నెల్లూరు నగరానికి దిక్కవుతోంది. తూర్పు, పడమర ప్రాంతాల వాహనదారులు అటు ఇటు వెళ్లాలనుకుంటే కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సి వస్తోంది. మినీబైపాస్ రోడ్డు ప్రాంతమంతా వాణిజ్య పరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా రాకపోకలు కూడా ఎక్కువగా ఉంటున్నాయి.

# పెన్నాలో మునిగి ఒకరి మృతి

మరొకరి గల్లంతు ● జొన్నవాడ రేవు వద్ద ఘటన ● రెండు కుటుంబాల్లో విషాదం

నెల్లూరురూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పెన్నాలో మునిగి ఓ నిండుప్రాణం బలైంది. మరొకరు గల్లంతయ్యారు. ఈ ఘటన జొన్నవాడ రేవు వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే... నెల్లూరులోని కొత్తూరు వద్ద నున్న శ్రీలంకాలనీకి చెందిన గణేశన్ నరసింహ (19) అలియాస్ విశాల్ అమ్మమ్మ వాళ్ల ఊరైన నెల్లూరురూరల్ మండలంలోని దేవరపాళెంకు ఇటీవల వచ్చాడు. గ్రామానికి చెందిన బేల్దారి సంగవేలు కోటయ్య (24), విజయ్, ములుముడికి చెందిన లోకేష్‌లతో కలిసి ఆదివారం సాయంత్రం పెన్నాలో ఈతకొడదామని ఊరి నుంచి 2 కి.మీ దూరానున్న జొన్నవాడ రేవు వద్దకు వెళ్లారు. ఈత రాకపోయినా నరసింహ, కోటయ్య, లోకేష్ పాతవంతెన వద్ద నదిలోకి దిగారు. కొంత సేపటికి లోకేష్ బయటకు వచ్చేశాడు. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నరసింహ, కోటయ్య బయటకు రాలేదు. దీంతో అనుమానం వచ్చిన విజయ్, లోకేష్ గాలింపు ప్రారంభించి, కేకలు వేశారు. సమీప వ్యక్తులు కొందరు వచ్చి వారుకూడా గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో దేవరపాళెం వాసులకు సమాచారం ఇచ్చారు. అక్కడ్నుంచి స్నేహితులు, గ్రామస్థులు సంఘటనా స్థలి వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ గుంజి వేణు, ఎస్సై లక్ష్మణరావు, వారి బృందం అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టగా నరసింహ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి కోటయ్య కోసం గాలింపు మొదలుపెట్టారు. అతని ఆచూకీ లభ్యం కాకపోవడం, చీకటిపడటంతో గాలింపును నిలిపివేశారు. సమాచారం అందుకున్న టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. కోటయ్య గాలింపు కోసం రిస్క్యూ బృందం కావాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు.







నరసింహ మృతదేహం, (ఇన్‌సర్ట్) నరసింహ (ఫైల్)

గల్లంతైన కోటయ్య (ఫైల్)

**డేంజర్ స్పాట్ అది..**

జొన్నవాడ రేవు వద్ద పాత వంతెన డేంజర్ స్పాట్‌గా ఉంది. ఈ ప్రాంతంలో సుడిగుండాలు ఎక్కువగా ఉంటాయన్నది నానుడి. ఇక్కడ ఈతకెళ్లిన అనేక మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి.

**బతికించిన ఫోన్‌కాల్**

నరసింహ, కోటయ్య, లోకేష్‌తో కలిసి విజయ్ కూడా ఈతకెళ్లాడు. ఈత కొట్టేప్రయత్నం చేస్తూ విజయ్‌ను కూడా నీళ్లలోకి దిగమని పిలిచారు. అప్పుడే అతడికి ఫోన్ రావడంతో మాట్లాడుతూ పక్కకు వెళ్లాడు. ఇంతలో నీట మునిగిన ముగ్గురు చేతులు పైకెత్తి కేకలు వేస్తూ కనిపించారు. స్వల్పంగా ఈత వచ్చిన లోకేష్ మాత్రం బయటపడ్డాడు.




### బోటు అమ్మి ఐస్ బండి వేస్తున్నా...

మత్స్యసంపద దొరక్క, వేట సాగక పోవటంతో జీవనం కష్టంగా మారింది. దీంతో బోటు అమ్మి ఐస్ బండి వేస్తు న్నా. ఐస్ వ్యాపారం డల్‌గా ఉన్నప్పుడు కూలి పనులకు వెళుతున్నా.

- అప్పాడి తిరుపతి స్వామి



### భారంగా జీవనం

సముద్రంలో మత్స్యసంపద తగ్గి పోవటంతో చేపలవేట ద్వారా జీవనం కష్టతరంగా ఉంది. నాకున్న ముగ్గురు పిల్లలుకు వివాహమై వెళ్లి పోయారు. నాకు రూ.4వేలు పింఛన్ వస్తున్నా, తాను చేపలవేటకు వెళుతున్నా జీవనం కష్టంగానే ఉంది.

- అప్పాడి వెంకటరమణయ్య, మత్స్యకారుడు



### కూలి గిట్టుబాటు కావటంలేదు

సముద్రంలో మత్స్యసంపద తగ్గిపోవటంతో వేటకు వెళ్లిన వారికి కూలి కూడా గిట్టుబాటు కావడంలేదు. ఒక్కో సారివలలకు నత్తగుల్లలు పడుతుండటంతో వాటిని భార్యా భర్తలిద్దరం రోజంతా వల నుంచి వేరు చేయాల్సి వస్తోంది అలాంటి సమయంలో పూటగడవటం కూడా కష్టంగా ఉంది. ప్రభుత్వం బోట్లు, వలలకు రాయితీలు ఇస్తే తప్ప వేట సాగించలేం.

- గొల్లపోతి మీరయ్య, మత్స్యకారుడు



### పెద్ద బోట్లతో దెబ్బతింటున్న వలలు

సముద్రతీరం వరకు పెద్ద బోట్లు వచ్చి వేటాడుతుండటంతో మత్స్యసంపదను వారు కొల్లగొట్టుకుపోవటమే కాకుండా మా వలలు దెబ్బతింటున్నాయి. రూ.30 వేలు పెట్టి కచ్చాల వల కొంటే పెద్ద బోట్ల తాకిడికి అది దెబ్బతింది. దీంతో వేట కొనసాగించడం భారంగా ఉంది.

-రాసాని సుధాకర్, మత్స్యకారుడు

# వేట సాగక.. పూట గడవక!

- ప్రత్యామ్నాయ ఉపాధి వైపు మత్స్యకారులు
- బోటు, వలల రాయితీకి గత ప్రభుత్వం మంగళం
- పెద్దపెద్ద హైస్పీడ్ బోట్లతో దెబ్బతింటున్న వలలు
- జీవనోపాధి కరువై.. ఇతర పనుల్లో గంగపుత్రులు

**కాలక్రమేణా మత్స్యకారుల జీవన విధానంలో మార్పులు వస్తున్నాయి. వారి ప్రధాన వృత్తి సముద్రపు వేటే అయినా వేట ద్వారా వారి జీవనం కష్టతరంగా మారింది. దీంతో ప్రత్యామ్నాయ ఉపాధి వైపు వారు నడుస్తున్నారు. జిల్లాలో సుమారు 18 వేల మత్స్యకార కుటుంబాలు ఉండగా, వారంతా సముద్రవేటపైనే ఆధారపడి జీవించేవారు. వారిని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ అయిన బోట్ల ద్వారా 12,440 కుటుంబాలుగా గుర్తించారు.**

కావలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార కుటుంబాల్లో గతంలో 90 శాతం మంది సముద్రపు వేటపైనే ఆధారపడి జీవించేవారు. పురుషులంతా తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో సముద్రంలో వేటకు వెళ్లి ఉదయం 10-11 గంటల లోపు తిరిగి వచ్చేవారు. దీంతో మహిళలు వారికి ఆహారం తీసుకుని వెళ్లి, వారు ఒడ్డుకు వచ్చే వరకు ఎదురు చూస్తుండేరు. తీరా ఒడ్డుకు వచ్చిన తర్వాత మత్స్యసంపదను బయటకు చేర్చుకునేవరకు వారికి మహిళలు సహాయపడేవారు. వలలకు ఎక్కువ మోతాదులో చేపలు చిక్కితే వాటిని అక్కడకు వచ్చిన వ్యాపారులకు విక్రయిస్తారు. తక్కువ మోతాదులో చేపలు చిక్కినా, మార్కెట్లో ఖర్చుకాని చేపలు పడినా వాటిని మహిళలు సమీపంలోని పట్టణాలకు వెళ్లి విక్రయించేవారు. ఇలా కుటుంబ సభ్యులంతా సముద్రపు వేట పైనే జీవించేవారు. ఖాళీ సమయంలో పురుషులు సముద్రతీరానికి వెళ్లి చిక్కుబడిన, పాడై పోయిన వలలను సరి చేసుకుంటుంటేవారు. వేటకు వెళ్లిన పురుషులు ఒడ్డుకు వచ్చే లోపు మహిళలు ఇళ్ల వద్ద ఆటలు ఆడుకుంటూ కాలక్షేపం చేసేవారు.

**● ప్రత్యామ్నాయ ఉపాధి వైపు**

సముద్రంలో మత్స్య సంపద తగ్గుతుండటంతో మత్స్యకారులు ప్రత్యమ్నాయ ఉపాధి వైపు మొగ్గు చూపుతున్నారు. పెద్దపెద్ద హైస్పీడ్ బోట్లు వచ్చాక ఇతరప్రాంతాల వారు తీరం వెంబడికల్లా వచ్చి వేట సాగిస్తున్నారు. దీంతో వాటి వలలకు చేప పిల్లలు, గుడ్లు కూడా చిక్కుతుండటంతో మత్స్యసంపద బాగా తగ్గుతోంది. గతంలో తీరంలో కొంత దూరం వేటకు వెళ్లి వస్తేనే సమృద్ధిగా దొరికే చేపలు ఇప్పుడు ఎంత దూరం వెళ్లినా సరిగా దొరకటంలేదు. దీంతో ఇంజన్‌లేని ఒక్కో ఫైబర్ బోటుకు ఇద్దరు మత్స్యకారులు వేటకు వెళ్లి వస్తే వారికి రోజు కూలి కూడా గిట్టుబాబు కావడంలేదు. దీనికితోడు గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులకు రాయితీపై బోట్లు, వలలు ఇవ్వటంలేదన్నారు.





చేపల వేట లేకపోవడంతో వలలు సరిచేసుకుంటున్న మత్స్యకారులు (ఇన్‌సెట్) పెద్ద బోట్ల వేటకు దెబ్బతిన్న వలలు

జీవన శైలి



వలలో ఇరుక్కున్న నత్తగుల్లలు తీస్తున్న మత్స్యకారులు

## కల్తీ మద్యంతో జగన్ హోల్‌సేల్ వ్యాపారం

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యంతో హోల్‌సేల్ వ్యాపారం చేసిన పెద్ద మనిషి వైఎస్ జగన్మోహన్‌రెడ్డే అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నెల్లూరు నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్నమయ్య జిల్లాలో కల్తీ మద్యంను ఎక్సైజ్ శాఖ అధికారులు రైడ్ చేసి పట్టుకున్నారన్నారు. అయితే రాష్ట్రమంతా కల్తీ మద్యంను చంద్రబాబే ప్రోత్సహిస్తున్నారని వైసీపీ అధినేత జగన్ అర్థం లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమాలను కూటమి ప్రభుత్వం సహించేది లేదన్నారు. కల్తీ మద్యం నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపటం జరిగిందని పేర్కొన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా జగన్ పాలనలో హోల్‌సేల్ కల్తీ మద్యం వ్యాపారం జోరందుకుందన్నారు. ఈ కల్తీ మద్యం తాగి వేలాది మంది చనిపోగా లక్షలాది మంది అనారోగ్యం పాలయ్యారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రూ.3500 కోట్ల కుంభకోణం ఓ సంచలనమని విమర్శించారు. 2014లో గవర్నర్ పాలన సాగుతున్న సమయంలో సర్వేపల్లి, కావలి నియోజక వర్గాల్లో కల్తీమద్యంకు ఎంతో మంది మరణించారన్నారు. అప్పట్లో అధికారులు 14 డంప్‌లను గుర్తించి కేసులు నమోదు చేశారని చెప్పారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై 4, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై 6 కేసులు నమోదయ్యాయన్నారు. సర్వేపల్లిలో 5 మంది, కావలిలో ఒకరు ఈ కల్తీ మద్యం వల్ల మృత్యువాత పడ్డారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అవినీతికి, మద్యం మాఫియాను ప్రోత్సహించి, కల్తీ మద్యం హోల్‌సేల్ వ్యాపారం చేసిన జగన్‌రెడ్డికి మాట్లాడే హక్కు లేదని విమర్శించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇస్కాన్ టెంపుల్ సమీపంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి పూరిల్లు దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంటి పైకప్పు, ఇంట్లోని కొన్ని వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంటి యజమాని యాకసిరి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బందితెలిపారు.

**నవాబు పేటలో...**

నవాబుపేట మసీదు వీధిలో రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ సుందూరు జగన్మోహన్‌రెడ్డి ఇంటి వెనుక గోడంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని సిబ్బంది తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం ఉధృతం

- ఫాప్టో ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

నెల్లూరు(విద్య), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తున్నామని ఫాప్టో నేతలు పేర్కొన్నారు. ఫాప్టో ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి వీఆర్‌సీ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఫాప్టో రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీనచలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన 12వ పీఆర్‌సీ విడుదల చేయడంతో పాటు పాత బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన ఉద్యోగుల పెన్షన్ బకాయిలు ఇవ్వాలని, మెమో 57 అమలు చేయాలని, పీఆర్‌సీ పునరుద్ధరించాలని తదితర డిమాండ్‌లతో చేపట్టే చలో విజయవాడను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫాప్టో చైర్మన్ కే.మధుసూదన్, సెక్రటరీ జనర్ జావీద్, కో చైర్మన్‌లు మురళీకృష్ణ, మాస ప్రసాద్, మాధవ, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ శేషులు, నరసింహం, హజరత్, పిచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న ఫాప్టో నాయకులు

## సరుకులు తీసుకున్నారా... సంతృప్తేనా..?

- 'రేషన్'పై అభిప్రాయాలు చెప్పేందుకు స్కానింగ్
- చౌక దుకాణాల ఎదుట క్యూ ఆర్ కోడ్‌తో బ్యానర్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గతంలో రేషన్ సరుకులు తీసుకోవాలంటా లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడేవారు. సరుకులు సక్రమంగా ఇవ్వకపోయినా, సరుకులకు ఎక్కువ డబ్బు వసూలు చేసినా ఎవరికి చెప్పుకోవాలో తెలిసేది కాదు. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. ఈ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రేషన్ సరుకులను పారదర్శకంగా పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంది. అంతేకాదండోయ్... సరుకులు తీసుకున్నవారు తమ అభిప్రాయాలు తెలియచేసే వెసులుబాటును కూడా కల్పించింది. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిన ప్రభుత్వం, ఆ కార్డులోనే క్యూర్ కోడ్‌ను పొందుపరచింది. ఈ క్యూర్ కోడ్ ఉన్న బ్యానర్‌ను చౌకదుకాణాల ముందు ప్రదర్శించాలని ఆదేశాలు కూడా ఇచ్చింది. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకోవటంతోపాటు, ఐదు అంశాలకు సంబంధించి సమాచారం తెలుపవచ్చు.




**● అవి ఏమిటంటే...**

1. మీరు ఈనెల సరుకులు తీసుకున్నారా ?
2. నాణ్యతపై సంతృప్తిగా ఉన్నారా..
3. డీలరు సరైన తూకంతో సరుకులు సరఫరా చేశారా...
4. డీలరు మీతో మర్యాదగా వ్యవహరించారా..
5. మీ దగ్గర సరుకుల ధర కంటే అధికంగా నగదు వసూలు చేశారా..?

ఈ ప్రశ్నలకు అవును, కాదు జవాబులను ఎంపిక చేసుకోవాలి. ఆ తరువాత సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేస్తే ఆ వివరాలు ప్రభుత్వ వెబ్‌సైట్‌కు చేరుతాయి. కార్డుదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత డీలరుపై అధికారులు చర్యలు తీసుకుంటారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం) అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వేదాయపాలెం రైల్వేగేటు సమీపంలో జరిగింది. సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన మృతుడు ఎరుపు రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు నెల్లూరు రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాకపోవంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

సంగం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన వద్ద ముంబాయి జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురైన యువకుడు తుపాకుల కరుణాకర్ (22) వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బుచ్చిరెడ్డిపాళెం మండలం పల్లాపల్లి గ్రామానికి చెందిన కరుణాకర్ శనివారం రాత్రి బైక్‌పై తను కాపలా ఉంటున్న ఉదయగిరిలోని ఓ తోటలోకి వెళ్తుండగా మార్గమధ్యంలో పెరమన వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి పరారవగా గాయాలై రోడ్డు మీద పడిఉన్న కరుణాకర్‌ను మంత్రి ఆనం కాన్వాయ్‌లో వెళ్తున్న పోలీసులు చికిత్స నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించిన విషయం విదితమే. కరుణాకర్ ఆరోగ్యం విషమంగా ఉండడంతో ఆదివారం తెల్లవారుజామున నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆ మేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడుపై సంతపేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. సంతపేట కామాక్షి నగర్‌కు చెందిన ఓ బాలిక పదో తరగతి చదువుతోంది. సంతపేటలోని ఓ దుకాణంలో పని చేస్తున్న శశి అనే యువకుడు గత కొంతకాలంగా బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈనెల 3వ తేదీన స్కూల్‌కు వెళుతుండగా మార్గమధ్యలో యువకుడు అడ్డుకుని ఆమెను బాలాజీనగర్‌లోని తన పిన్ని ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై బలవంతంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను బైక్‌పై మైపాడు బీచ్‌కు తీసుకెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. సాయంత్రం అవుతున్నా బాలిక ఇంటికి రాకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు స్కూల్ వద్దకు వెళ్లి విచారించారు. బాలిక స్కూల్‌కు వెళ్లలేదని తెలియడంతో ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి సుమారు 8 గంటల సమయంలో బాలికను ఆమె ఇంటి సమీపంలో యువకుడు వదిలి వెళ్లాడు. ఇంటికి చేరుకున్న బాలికను ఇప్పటి వరకు ఎక్కడికి వెళ్లావని కుటుంబసభ్యులు ప్రశ్నించగా ఆమె జరిగిన విషయాన్ని చెప్పింది. ఈ మేరకు బాలిక బామ్మ శనివారం రాత్రి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఈ.దశరథరామారావు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

ఆత్మకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాశిలి సమీపంలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కృష్ణపట్నం పోర్టు నుంచి పూణే వెళుతున్న బొగ్గు లారీ మరమ్మతులకు గురికావడంతో డ్రైవరు యువరాజు లారీని వాశిలి, కొండమీదకొండూరు మధ్య హైవే పక్కన ఆపి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇంతలో అదే మార్గంలో పామాయిల్ తీసుకెళుతున్న లారీ ఈ బొగ్గు లారీని ఢీకొంది. దాంతో లారీ డ్రైవర్లు గుణశేఖర్, యువరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిసితిని సమీక్షించారు. క్షతగాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈక్రమంలో మరోలారీ అదే ప్రాంతంలో అదుపుతప్పి పడిపోయింది. అయితే ఎవరికీ ప్రాణపాయం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బొగ్గు లారీ డ్రైవరు బి యువరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ జిలాని తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రాపూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటన రాపూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాపూరు మండలం తూమాయి గ్రామ సమీపంలోని ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందగా, దాడి చేశామని ఎస్‌ఐ తెలిపారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 9100 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

## నేడు పీజీఆర్ఎస్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు.

## రేపు సతీష్‌రెడ్డి రాక

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ జాతీయ భద్రతా మండలి సభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు జీ సతీష్ రెడ్డి మంగళవారం నెల్లూరుకు రానున్నారు. ఆయన ఈ నెల 9వ తేదీ వరకు నెల్లూరులో పర్యటిస్తారని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

## రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా క్రీడాకారులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో ఈనెల 25, 26వ తేదీ ల్లో జరిగే 39వ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా యోగా క్రీడా అసోసియేషన్ ఆధ్వర్యంలో రెయిన్‌బో పాఠశాలలో జిల్లాస్థాయిలో అండర్-8 నుంచి 60 ఏళ్ల వయస్సుల కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆదివా రం బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి మాట్లాడుతూ పోటీల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ప్రసన్నకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ స్వయంప్రభ, న్యాయనిర్ణేతలు రాజా, శ్రీను, పద్మావతి, కోఆర్డినేటర్లు రవీంద్ర, రాజేంద్ర, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో విజయం సాధించిన బాలలతో నిర్వాహకులు

## స్కూటీ, ఆటో ఢీ.. ఒకరి మృతి

- మహిళకు తీవ్ర గాయాలు



మృతుడు లక్ష్మయ్య (ఫైల్)

కావలి రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతుబజారు ఎదురుగా ట్రంక్ రోడ్డులో శనివారం అర్ధరాత్రి స్కూటీని వెనుకనుండి ఆటో బలంగా ఢీకొంది. దీంతో బైకు నడుపుతున్న ఆవుల లక్ష్మయ్య(29) డివైడర్‌పై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీ వెనుక కూర్చున్న ఆదిలక్ష్మి తీవ్రంగా గాయపడింది. 1వ పట్టణ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు అన్నగారిపాలెం పంచాయతీ పెదనట్టుకు చెందిన గ్రామ కాపు ఆవుల లక్ష్మయ్య తుమ్మలపెంట సెంటర్‌లో బేకరీ నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. పనుల నిమిత్తం స్కూటీపై కావలికి వచ్చాడు. బాపట్ల జిల్లా చీరాల మండలం ఓడరేవుకు చెందిన పరిచయస్తురాలైన ఆదిలక్ష్మిని తీసుకుని స్కూటీపై వెళ్తుండగా వెనుక వైపు ఆటో ఢీ కొని వెళ్లిపోయింది. దీంతో లక్ష్మయ్య సంఘటనస్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడ్డ ఆదిలక్ష్మిని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అందరి తో ఎంతో కలివిడిగా ఉండే లక్ష్మయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సంఘటనా స్థలంలో లభించిన సీసీ పుటేజ్ ఆధారంగా ప్రమాదానికి కారణమైన ఆటో తుఫాన్‌నగర్ బాషాకు చెందినదిగా పోలీసులు గుర్తించారు. అతనిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

## జర్నలిస్టుల రాష్ట్రస్థాయి క్రికెట్‌లో నెల్లూరు జట్టు విజయం

నెల్లూరు(విద్య), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో జరుగుతున్న జే శాప్ జర్నలిస్టల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో తొలిరోజు జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు పశ్చిమగోదావరి జట్టుపై విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 121 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పశ్చిమగోదావరి జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 106 పరుగులు మాత్రమే చేయడంతో 16 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు విజయం సొంతం చేసుకుంది. సోమవారం నెల్లూరు జట్టు కర్నూలుపై క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడనుందని జేశాప్ రాష్ట్ర కార్యదర్శి నరేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందకిషోర్, సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.



విజయ చిహ్నం చూపుతున్న నెల్లూరు జట్టు క్రీడాకారులు

## చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 138 |
| స్కిన్ చికెన్ | 246 |
| స్కిన్‌లెస్ | 270 |

కోడిగుడ్ల ధర (100): 520

## బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.11,273 |
| వెండి కిలో ధర | రూ. 1,51,500 |
| వెండి ఒక గ్రాము | రూ.155.50 |

## స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్‌గా కాకుపల్లి

నెల్లూరురూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రలో భాగంగా నెల్లూరురూరల్లోని కాకుపల్లి గ్రామం విలేజ్ ఆర్గనైజేషన్‌గా ఎన్నికైంది. ఈ మేరకు సోమవారం జిల్లాస్థాయి స్వచ్ఛ అవార్డుల్లో భాగంగా కాకుపల్లి పంచాయతీకి అవార్డు అందచేయనున్నట్లు ఈ గ్రామ ప్రత్యేకాధికారి రోజ్‌మేరి ఆదివారం తెలిపారు. గ్రామంలో మహిళలతో పెరటితోటలు పెంపకం, వాటి అవగాహన, నిర్వహణ వంటి కార్యక్రమాలను పొదుపు గ్రూపుల ద్వారా విస్తృతంగా చేశామని అందులో భాగంగా ఈ అవార్డు దక్కిందని ఆమె తెలిపారు.

## న్యూస్ బాక్స్

### విద్యుత్ ఆందోళనకు 'తెలుగు నాడు' దూరం

నెల్లూరు(జడ్పీ), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ జేఏసీ ఈనెల 6 నుంచి చేపడుతున్న నిరసన ధర్నా కార్యక్రమాలకు తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం దూరంగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవల విభాగంలో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు విద్యుత్ సరఫరా అందించడంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తాము కట్టుబడి ఉన్నామని, అందుకు అనుగుణంగా తమ యూనియన్ నిరసన, ధర్నా కార్యక్రమాలకు దూరంగా ఉంటుందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యూలర్ చేయడం, జేఎల్ఎంలకు గ్రేడ్ -2 హోదా కల్పించడం వంటి పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, దానిపై సీఎం సానుకూలంగా స్పందించారని, దీంతో తాము నిరసనలకు దూరంగా ఉంటున్నామన్నారు.

### సమతానగర్ సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి ఆన్‌లైన్ లాగిన్లు అందచేయడంపై సమతానగర్ సచివాలయంలోని ఓ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ కమిషనర్ నందన్ శనివారం ఉత్తర్వులిచ్చారు. ఆ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. సమతానగర్ సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీగా పని చేస్తూ బదిలీపై వెళ్లిన షేక్ నాయబ్ తన లాగిన్లును ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించినట్లు ఆ స్థానంలో కొత్తగా వచ్చిన జీ హరికృష్ణ గుర్తించి ఫిర్యాదు చేయడంతో సస్పెండ్ చేశారు.

### నవంబరు 5న కార్తీక దీపోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పొదలకూరురోడ్డు హెచ్ఆర్ కల్యాణ మండపం వద్ద ఉన్న ఏకాదశ నాగులు, నాగమానసాదేవీ శ్రీబాలసుబ్రహ్మణ్యం స్వామి పుట్ట ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి కార్తీక దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ మేనేజరు చక్రాల ఆనందకుమార్, ప్రధాన అర్చకులు ఇనుమన మెళ్లూరు వసంతరావు శర్మ, ఆలయ శాశ్వత సేవకురాలు చక్రాల మీనాక్షి ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్తీక దీపాలు ఏర్పాటుకు భక్తులు రూ.616 చెల్లిస్తే వారి పేరుపై కార్తీక మాసమంతా కార్తీకదీపం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే ఈనెల 25న నాగుల చవితి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. నవంబరు 5న కార్తీక పౌర్ణమి రోజు కార్తీక దీపోత్సవం జరుగుతుందని తెలిపారు.

### గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

ఇందుకూరుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. కమిటీ సభ్యులు గంపల మంజుల, మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం ఆశ్రమ స్థలదాత పొణక కనకమ్మ విగ్రహానికి రవీంద్రారెడ్డి పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. అనంతరం పిల్లలకు మహాత్మాగాంధీ జీవిత విశేషాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### యోగా శిక్షకురాలు ప్రసన్నకు సత్కారం



ప్రసన్నను సత్కరిస్తున్న యోగా సాధకులు

కోవూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ యోగా పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన కోవూరు యోగా చైతన్యకేంద్రం శిక్షకురాలు పీ ప్రసన్నను ఆదివారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని జేబీఆర్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో యోగా గురువు గోళ్ళ జనార్ధన్ ఆధ్వర్యంలో యోగా సాధకులు ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు శ్రీను, రమణయ్య, జయ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### జీఎస్టీ సవరణపై అవగాహన

వెంకటాచలం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లిలో ఆదివారం జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆధ్వర్యం లో జీఎస్టీ సవరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, చెంచయ్య పాల్గొన్నారు.

# ఎడగారులోనూ 4 పుట్లు!

● ఆశాజనకంగా ధాన్యం దిగుబడులు ● అనుకూలించిన వాతావరణం ● రైతుల్లో ఆనందం



వరి ధాన్యం బయటకు పంపుతున్న యంత్రం

నెల్లూరురూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : వరి పంటకు ప్రతికూలంగా ఉండే ఎడగారులోనూ ఈసారి ఏకంగా ఎకరానికి నాలుగు పుట్ల ధాన్యం దిగుబడి వచ్చింది. కేఎన్ఎం 1638 రకం మూడు పుట్ల వరకు దిగుబడి వస్తుందని అంతా అంచనా వేయగా అందుకు భిన్నంగా నాలుగు పుట్లు దిగుబడి వచ్చి రైతులకు ఆశ్చర్యం కలిగించింది. రెండున్నర పుట్ల కంటే ఎక్కువగా రాని ఎంటీయూ 1010 రకం ఈసారి మూడున్నర పుట్ల వరకు దిగుబడి వచ్చింది. ఇందుకు వాతావరణం అనుకూలంగా మారడం, సాగునీటి లభ్యత పుష్కలంగా ఉండటమే కారణమని వ్యవసాయ నిపుణులు అంటున్నారు. దీంతో వరి పంట సాగు చేసిన ప్రతి రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ధరలు పూర్తిగా తగ్గించి కొంటున్నారని, వరికోతలు చివర్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్న బాధ తప్ప రైతుల్లో ఆనందమే కనిపిస్తోంది. నెల్లూరుకు తూర్పు ప్రాంతం రూరల్లోని గ్రామాలకు సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్, కోడూరు, లేబూరు కాలువ కింద వరి పంట విస్తృతంగా సాగు చేశారు. పడమర వైపు గ్రామాల్లో కనుపూరు కాలువతో పాటు చెరువుల సాగునీటి లభ్యత ఆధారంగా వరి సాగు చేశారు. 130 రోజుల పంటకాలంతో కేఎన్ఎం, 115 రోజులుకు కోతకొచ్చే ఎంటీయూ రకాలను సాగు చేశారు. ఎడగారు సీజన్ వరికి ప్రతికూలంగా ఉంటుందన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తుంటారు. కానీ ఈసారి ఎండలున్నప్పటికీ వర్షాలు పడుతూ వరికి అనుకూల వాతావరణం కలిగింది. అందులోనూ చెరువులు, కాలువల్లో పుష్కలంగా సాగు నీరు అందుబాటులో ఉండటంతో ఎడగారు వరికి కలిసొచ్చింది. దీంతో యాజమాన్య పద్ధతులతో సంబంధం లేకుండానే వరి ధాన్యం దిగుబడులు వచ్చాయి. గత రబీ సీజన్ పూర్తవగానే రైతులు వెంటనే ఎడగారుకు సిద్ధమైపోయారు. అటు జిల్లా యంత్రాంగం కూడా సాగునీటి లభ్యత సోమశిల జలాశయంలో పుష్కలంగా ఉండటంతో రెండవ పంటకు నీరిస్తామంటూ ప్రకటించింది. దీంతో రబీ సాగుకు పోటీగా ఎడగారులోనూ పూర్తి విస్తీర్ణం వరినే సాగుచేయడం గమనర్హం.



ధాన్యం బస్తాలు లోడ్ చేస్తున్న కూలీలు

● ధరలతో ఆందోళన...

అంతా బాగుంది కానీ.. అల్లుడు నోట్లో శనుంది అన్నట్టు తయారైంది ఎడగారులో రైతుల దుస్థితి. ఆశించిన దానికంటే ఎక్కువగా దిగుబడులు వచ్చాయని అన్నదాతలు ఆనంద పడేలోపే ధరలు పతనమవడం ఆందోళనకరంగా మారింది. దళారులు, మిల్లర్లు ఏకమై ధాన్యం ధరలను ఘననీయంగా తగ్గించేశారు. కాగా చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు అధికారుల చర్యలున్నాయని రైతులు మండిపడుతున్నారు. వరికోతలు మొదలైనప్పుడు ఏర్పాటు చేయాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కోతలు పూర్తయ్యాక ఏర్పాటు చేయడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ధరలు పతనం, అక్కరుకు రాని పీపీసీల ఏర్పాటు మినహా ఈ ఏడాది ఎడగారు సాగు చేసిన రైతులు ఆనందంగా ఉన్నారు.

## కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తా

● ఎన్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు



న్యాయవాది రంగారావును సత్కరిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ లీగల్ అడ్వైజర్ వేలూరు రంగారావు అన్నారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని తిరుపతినాయుడు కల్యాణ మండపంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా తనను రెండోసారి ప్రభుత్వం నియమించడం ఆనందంగా ఉందన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహకారంతో తొలిసారి నియమితులైన తరుణంలో కార్పొరేషన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు రూ.3కోట్లకు పైగా న్యాయబద్ధంగా వసూలు చేయించానన్నారు. రెండోసారి కూడా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవలందిస్తానని తెలిపారు. అనంతరం వాకర్స్ సంఘం ప్రతినిధులు కె.హరిప్రసాద్, రాఘవరెడ్డి, హైకోర్టు న్యాయవ్యాది హరినాథ్‌రెడ్డి, వాకర్స్ సంఘం అధ్యక్షుడు పోబోలు సత్యం, కార్యదర్శి సురేష్, నేతలు శేషగిరిరావు, తదితరులు పాల్గొని రంగారావును ఘనంగా సత్కరించారు.

## ప్రజల అవసరాలు తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

● చేపల మార్కెట్ ప్రారంభోత్సవంలో మంత్రి నారాయణ



మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలను గుర్తించి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం మైపాడురోడ్డు వేణుగోపాలనగర్ వద్ద రూ.20 లక్షలతో ఆధునీకరించిన చేపల మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దయనీయంగా ఉన్న ఈ మార్కెట్‌ను గత ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని వాపోయారు. ఈ ప్రాంతంలో ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన స్మార్ట్ స్ట్రీట్ బజారులో 120 షాపులు ఏర్పాటు చేశామన్నారు. వాటిని త్వరలో సీఎం చంద్రబాబు చేతులుమీదుగా వర్చువల్ విధానంలో లబ్ధిదారులకు అందజేస్తామని పేర్కొన్నారు. 9వ డివిజన్‌లో 19 ఎకరాలను సేకరించి దేశంలోనే అందమైన, ఆధునాతమైన మార్కెట్‌ను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్ పాల్గొన్నారు.

**కార్యకర్తలు భాగస్వాములు కావాలి**

నెల్లూరు(వైద్యం): ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నిరంతరం ప్రజాక్షేత్రంలో తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న వారు మాత్రమే తనతో ఉంటారన్నారు. పనులు ఎంత ముఖ్యమో, చేసిన పనిని ప్రజలకు వివరించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అభివృద్ధికి బ్రాండ్ టీడీపీ అని, టీడీపీకి బ్రాండ్ కార్యకర్త లేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో జోష్.. కొనుగోళ్లు అదుర్స్!

● మధ్యతరగతికి ఊరట

● పెరిగిన అమ్మకాలు

పొదలకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ఇటీవల ప్రకటించిన జీఎస్టీ 2.0 అన్ని వర్గాల ప్రజలకు ఊరట కలిగించింది. జీఎస్టీ తగ్గింపుతో పలువురికి ప్రయోజనం చేకూరింది. ముఖ్యంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు తమ చిరకాల స్వప్నాలను సాకారం చేసుకుంటున్నారు. ఇన్నాళ్లు ఆకాశాన్నంటే ధరలతో బెంబేలెత్తిపోయిన వినియోగదారులు దసరా కానుకగా జీఎస్టీ తగ్గింపు అమల్లోకి రావడంతో గృహోపకరణాలు, టీవీలు, ఫ్రిజ్‌లు, ద్విచక్ర వాహనాలు వంటివి కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల అమ్మకాలు అన్నిచోట్ల జోరందుకున్నాయి.



**నెల వాయిదా చెల్లింపు తగ్గినట్లే..**

గతంలో బేసిక్ మోడల్ ద్విచక్ర వాహనం కొనాలంటే అన్నీ రకాల చెల్లింపులు కలిపి రూ.లక్ష దాటితే కానీ వచ్చేది కాదు. ఇప్పుడు జీఎస్టీ తగ్గింపుతో ఆర్థిక భారం తగ్గింది. ఇదో పెద్ద ఊరట. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం.

- అలుపూరు శ్రీనివాసులు, వినియోగదారులు

**గతంలో పోలిస్తే విక్రయాల పెరిగాయి**



గతేడాది దసరాకు 21 వాహనాలు అమ్మడం కష్టమైంది. ఈసారి 36 ద్విచక్రవాహనాలు విక్రయించా. మోడల్‌ను బట్టి రూ. 6 నుంచి రూ.15 వేలు వరకు తగ్గింది. ఎక్కువ మంది ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేశారు.

- రాఘయ్య, హోండా షోరూం అధినేత, పొదలకూరు



**టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్లు బాగా అమ్ముడుపోయాయి**

జీఎస్టీ 2.0 సంస్కరణలు వినియోగదారులకు ఆర్థికంగా ఊరట కలిగించాయి. టీవీలు, ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లు, డిష్ వాషర్లు వంటి పరికరాలు చౌకగా మారడంతో ఈసారి ఎక్కువమంది కొనుగోలు చేశారు. దీనికి కారణం జీఎస్టీ తగ్గడమే నని భావిస్తున్నాం. దీని వల్ల ప్రతీ వినియోగదారు డూ సుమారు రూ. 2500 నుంచి రూ.6 వేల వరకు లబ్ధి పొందారు. మొత్తానికి అమ్మకాలు బాగా పెరిగాయి.

- నున్నా రమేష్, వెంకటరామ హోమ్ అప్లియన్సెస్ అధినేత, పొదలకూరు

## వైభవంగా దుర్గాదేవి గ్రామోత్సవాలు



మహంకాళి అలంకరణలో దుర్గాదేవి

మనుబోలు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం అర్ధరాత్రి దుర్గాదేవి గ్రామోత్సవాలు వైభవంగా నిర్వహించారు. 11 రోజుల పాటు దుర్గాదేవిని వివిధ రూపాలలో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆదివారం దుర్గాదేవిని మహంకాళి రూపంలో భారీ గజమాలతో అలంకరించారు. మనుబోలులో దుర్గాదేవి లడ్డు ప్రసాదం వేలంపాటలో ఆడిపూడి కృష్ణారెడ్డి రూ. 21 వేలకు, డబ్బుల మాలను కటికాల మణికంఠ రూ.20 వేలకు దక్కించుకున్నారు. అలాగే కోదండ రామపురంలో లడ్డును దువ్వూరు శ్రీనువాసులు రెడ్డి రూ. 55 వేలకు, డబ్బుల మాలను వీఆర్వో రాకేష్ రూ.40 వేలకు దక్కించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవాలు సంబరంగా సాగాయి. అనంతరం రెండు కలశాలను మనుబోలు పెద్దచెరువులో నిమజ్జనం చేయడంతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. భక్తులు అమ్మవారికి టెంకాయలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## పవన్ కల్యాణ్ కోసం ప్రత్యేక పూజలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ఆరోగ్యం కుదుటపడాలని కోరుతూ జనసేన పార్టీ నాయకులు నగరంలోని టక్కేమిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెంటనే కోలుకోవాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుణుకుల కిషోర్, గుర్రం కిషోర్, పవన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గా మల్లేశ్వరుడి ఆలయానికి విరాళం

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని తల్పగిరి కాలనీలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయానికి అమెరికాలో స్థిరపడిన ఆంధ్రా బ్రాహ్మణులు దేవస్థానం విరాళాలు అందజేశారు. ఈ విరాళాలను నగరంలోని ఆలూరి శిరోమణి శర్మ దంపతులు ఆదివారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ప్రవాసాంధ్ర బ్రాహ్మణులైన భాగవతుల మాధవీ ప్రవీణ్‌లు దేవస్థానంలో నిర్మిస్తున్న కల్యాణ వేదిక విద్యుద్దీకరణ, దీపాల అలంకరణకు, మాధవి తల్లి పేరున నిర్మిస్తున్న రుత్విక్ భోజనశాల నిర్మాణానికి రూ.1లక్ష ప్రకటించారు. మొదటివిడతగా రూ.35వేల చెక్కును అందజేశారు.

## తాగునీటి బోర్ల ఏర్పాటు



చేతిపంపును ప్రారంభిస్తున్న స్థానికులు

మనుబోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగనన్న కాలనీలో రెండు తాగునీటి బోర్లను ఆదివారం కాలనీ వాసులు ప్రారంభించారు. కాలనీకి మంచినీటి ట్యాంకు వసతి లేదు, కరెంటు ఉన్నప్పుడు మోటారు వేస్తే కొళాయిలకు వచ్చేలా ఏర్పాటు చేశారు. కరెంటు లేని సమయంలో నీటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయని గతంలో కాలనీవాసులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో జలజాక్షి ఒక బోరు పంచాయతీ నిధులతో, మరో బోరు మండల నిధులతో ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి గరుడయ్యను ఆదేశించారు. దీంతో కార్యదర్శి రెండు బోర్లు ఏర్పాటు చేయించడంతో కాలనీవాసులు సర్పంచు కంచి పద్మమ్మ, ఎంపీడీవో జలజాక్షి, కార్యదర్శి గరుడయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

## టీడీపీ నేత రఘురామిరెడ్డి హఠాన్మరణం



రఘురామిరెడ్డి(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాల్మానుపురంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మల్లు రఘురామిరెడ్డి (54) ఆదివారం మృతి చెందాడు. ఆయనకు గుండెల్లో నొప్పి రావడంతో బుచ్చిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రఘురామిరెడ్డి మృతితో ఆ కుటుంబంతోపాటు గ్రామంలో విషాదం నెలకొంది. పాడె గేదెల పోషణతో రఘురామిరెడ్డి కుటుంబాన్ని పోషించుకునేవాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అని ష్‌రెడ్డి సాల్మానుపురం చేరుకుని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అండగా ఉంటారని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు బత్తల హరికృష్ణ, హెచ్‌డీసీ చైర్మన్ దొడ్ల కోదండ రామిరెడ్డి, కూటమి నాయకులు ఉన్నారు.

## వైకల్యం శరీరానికే.. సంకల్పానికి కాదు

● డీఆర్వో విజయకుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఆర్వో విజయకుమార్

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వైకల్యం శరీరానికి మాత్రమేనని సంకల్పానికి కాదని జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ అన్నారు. నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం అంతర్జాతీయ బధిరుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ వైకల్యం కలిగి జీవితంలో అత్యున్నత స్థాయికి చేరిన వారి జీవితాలను ఆదర్శంగా తీసుకుని తమ జీవితంలో ముందుకు సాగాలన్నారు. మనోధైర్యంతో ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చన్నారు. ఎంతో మంది విభిన్న ప్రతిభా వంతులు తమ వైకల్యాన్ని జయించి ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు మహ్మద్ ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 'ఎస్' సేవలు



కృష్ణుడి విగ్రహానికి పూలమాల వేస్తున్ననేతలు

నెల్లూరురూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా యాదవ ఎంప్లాయీస్ సొసైటీ (ఎస్) సేవలను విస్తరించాలని ఆ సంఘం నాయకులు నిర్ణయించారు. నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగల రవీంద్రయాదవ్, పల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ. జిల్లాస్థాయి నుంచి మండల, గ్రామీణ స్థాయికి ఎస్ సేవలను తీసుకెళ్లాలని తీర్మానించారు. యాదవ కుటుంబాల్లోని పేద విద్యార్థులను గుర్తించి వారికి పూర్తి సహాయ, సహకారాలు అందించాలని, నియోజకవర్గాల వారీగా కమిటీలు ఏర్పాటు చేయాలని తీర్మానించాలని సూచించారు. రానున్న రోజుల్లో సొసైటీ బలోపేతానికి అందరు పూర్తి సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామినబోయిన వెంకటేశ్వర్లు, గుమ్మడి శ్రీనివాసులు, యనమల జానకిరామయ్య, అంబటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 11 మందితో సీఐటీయూ రూరల్ కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన నాగరాజు, నారాయణ

నెల్లూరురూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ నెల్లూరురూరల్ కమిటీ 11 మందితో ఎంపిక చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా గుంటి నాగరాజు, పొదర్తి నారాయణలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పొట్టేపాళెంలో నిర్వహించిన మహాసభలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ముందుగా సీఐటీయూ నేతలు సతీష్, మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రమజీవుల హక్కుల కోస సంఘం అలుపెరగని పోరాటం చేయాల్సి ఉందన్నారు. 8 గంట నుంచి 12 గంటల పని విధానాన్ని తీసుకురావడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టడం వల్ల అసంఘటితరంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 11, 12 తేదీలలో టీపీగూడూరు మండలం నరుకూరులో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, ఆలూరు తిరుపాలు, పొదర్తి నాగభూషణమ్మ, శ్రీదేవమ్మ, యోగ్గోలు, భాస్కర్‌లు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

● విగ్రహావిష్కరణలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ సృష్టికర్త బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాకుపల్లి కూడలిలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన రచ్చబండను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సుభాషిణి, కోసూరు కేశవులు, విగ్రహ కమిటీ నాయకులు రమణయ్య, వేణు(బాబీ), రణదీప్, రమేష్, శీనులు పాల్గొన్నారు. కాగా రూ.11 కోట్లతో నిర్మించిన నెల్లూరు-పొదలకూరు రోడ్డు విస్తరణ, ఆధునికీకరణ పనులను సోమవారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లును మాజీ మేయర్ భానుశ్రీతో కలిసి ఆయన పరిశీలించారు.

## అలరించిన 'నవ్వండి, నవ్వించండి'



శ్రీనివాసరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వర్ధమాన సమాజం భవనంలో చేతన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నవ్వండి, నవ్వించండి కార్యక్రమం అలరించింది. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ హాస్యనటులు అల్లురామలింగయ్య, నెల్లూరు జగదేవిపేటకు చెందిన తిక్కవరపు వెంకటరమణారెడ్డి పేరిట నిర్వహించారు. వారి చిత్రపటాలకు పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా ఒంగోలు విశ్రాంత ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, టీవీ నటుడు మురళీమోహన్‌రావు, నవ్వుల మాంత్రికుడు రమణారెడ్డి పుస్తక రచయిత ఉదయగిరి ఫయాజ్ పాల్గొన్నారు. అల్లు రామలింగయ్య, రమణారెడ్డిలపై క్విజ్, జోక్స్, పేరడీ, సినీ హాస్య గీతాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావును చేతన సంస్థ సభ్యులు కార్యదర్శి వై.శేషగిరీశం, విశ్వనాథం, సుబ్బరాయుడు, నారాయణస్వామిలు ఘనంగా సత్కరించారు.



హోటల్ రేష్మ బిర్యానీ 8వ వార్షికోత్సవం సందర్భంగా అధినేత షేక్ గౌసకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్నహోటల్ సిబ్బంది, తదితరులు

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 138 |
| స్కిన్ చికెన్ | 246 |
| స్కిన్‌లెస్ | 270 |

కోడిగుడ్ల ధర (100): 520

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.11,273 |
| వెండి కిలో ధర | రూ. 1,51,500 |
| వెండి ఒక గ్రాము | రూ.155.50 |

### మంగళస్నానాలతో కోదండరామునికి పూజలు

కావలి రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కావలి మండలం చౌదరిపాలెంలోని కోదండరామస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంగళస్నానాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం పం చసూక్త హోమం, లఘు పూర్ణాహుతి, సామూహిక లక్ష తులసి దళార్చన, తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసంత ర్పణ నిర్వహించారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# ఇంటి నిర్మాణానికి అనుమతులు ఉన్నాయి

**గేటుకు ఫ్లెక్సీ ఏర్పాటుపై కావలిలో చర్చ**

కావలి, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారు అన్ని అనుమతులూ పొందిన తర్వాతే నిర్మాణాలు చేట్టడం సహజం. ఒకవేళ ఎక్కడైనా అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మిస్తుంటే మున్సిపల్ అధికారులు పరిశీలించి.. ఈ ఇంటికి ఎలాంటి అనుమతులు లేవని బోర్డులు పెడతారు. ప్రభుత్వ స్థలమైతే 'ఇది ప్రభుత్వ స్థలం' అని బోర్డు పెట్టడం చూశాం. కానీ పట్టణంలోని ట్రంకు రోడ్డులో సత్యనారాయణస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న ఒక ప్రైవేట్ స్థలంలో నిర్మిస్తున్న ఇంటికి మున్సిపల్ శాఖ అనుమతులు ఉన్నాయని ఇంటి ప్లాన్‌తో సహా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆ ఇంటి ప్రహరీ గేటుకు కట్టారు. ప్రజలు ఆ ఫ్లెక్సీని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఇళ్లు నిర్మించుకునేవారెవవరూ అనుమతులు ఉన్నాయని ఫ్లెక్సీలు కట్టరు కదా! మరి ఇదేమిటనే చర్చ సాగుతోంది. ఆ ఇంటి నిర్మాణాన్ని 13వ వార్డుకు చెందిన పుల్లారెడ్డినగర్ వాసులు అందరూ వ్యతిరేకిస్తూ, నిర్మాణం ఆపమని అధికారులను



ఇంటి గేటుకు నిర్మాణ ప్లాన్ ఫ్లెక్సీ

విన్నవించుకున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అయినా నిర్మాణ పనులు ఆగలేదు. అనుమతులు తీసుకుని ఇల్లు కట్టుకుంటుంటే ఎందుకు ఆపాలనే భావనతో 'అనుమతులు ఉన్నాయి' అంటూ నిర్మాణదారులు ఫ్లెక్సీ కట్టారు. నిజానికి అనుమతులు తీసుకుని నిర్మించుకుంటుంటే దానిని ఆపాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్న ప్రతి ఒక్కరిలో కలగకమానదు. అయితే అసలు ట్విస్టు ఇక్కడే ఉంది. ఆ ఖాళీస్థలంలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు నిర్మాణం చేపడుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే సత్యనారాయణస్వామి దేవాలయం, పలు విద్యాసంస్థలు ఉన్న ఈ ప్రాంతంలో బార్ అండ్‌రెస్టారెంట్ పెడితే ప్రశాంతతకు భంగం కలగటమే కాక మహిళలకు రక్షణ కరువవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ బార్ అండ్ రెస్టారెంట్ వద్దని, నిర్మాణం ఆపాలని ఆ ప్రాంత ప్రజలు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నారు. అందుకే అక్కడ బార్‌అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయాలనుకున్న నిర్వాహకులు ఆ భవననిర్మాణానికి మున్సిపల్ శాఖ అనుమతులు ఉన్నాయంటూ ఏకంగా ఇంటి ప్లాన్‌తో కూడిన ఫ్లెక్సీని గేటుకు కట్టారు. దీంతో ఇలాంటి వింత ఎక్కడా చూడలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## రాళ్లపాడు ప్రాజెక్టులో గుర్తుతెలియని మృతదేహం

లింగసముద్రం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో రాళ్లపాడు ప్రాజెక్టులో మృతదేహం ఉందని లింగసముద్రం ఎస్సై ఎం నారాయణకు సమాచారం వచ్చింది. దీంతో వెంటనే ఆయన సిబ్బందితో హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు వెళ్లి మృతదేహం కోసం గాలించారు. అయితే ప్రాజెక్టు పాత, కొత్త స్పిల్‌వేల మధ్యలో జనరేటర్ రూం వద్ద ఉన్న గోడ కింద భాగంలోని నీళ్లలో ఎండిన చెట్టు కొమ్మల మధ్యలో తేలియాడుతున్న మృతదేహాన్ని ఎస్సై నారాయణ గుర్తించారు. మృతునికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉండి, బ్లూ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. అయితే వంటిపై చొక్కా లేదు. మృతదేహాన్ని బయటకు తీసేందుకు ఎస్సై నారాయణ, సిబ్బంది చర్యలు చేపట్టారు. అయితే మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడు... ఇది హత్య లేక ఆత్మహత్య అనేది మృతదేహాన్ని బయటకు తీసిన తరువాత పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

## నిబంధనలకు విరుద్ధంగా సిమెంట్ రోడ్డు నిర్మాణం

కందుకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండికందుకూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నీటి కుంటలో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారని సర్పంచు కుమ్మర బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బతుకు తెరువు కోసం ఏడేళ్ల క్రితం కొండికందుకూరు వచ్చి కుంట పోరంబోకులో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారిని అడ్డుపెట్టుకొని సీసీ రోడ్డు వేస్తున్నారని విమర్శించారు. ఉపాధి నిధులు దుర్వినియోగం చేయడంపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని సర్పంచు బ్రహ్మయ్య డిమాండ్ చేశారు.

## పోలేరమ్మకు పొంగళ్లు

కొండాపురం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరప్పాడు గ్రామంలో వెలసిన గ్రామదేవతలు పోలేరమ్మ, బంగారమ్మ అమ్మవార్లకు భక్తులు ఆదివారం పొంగళ్లు సమర్పించారు. గత రెండు వారాల చద్ది నైవేద్యాన్ని చెల్లించి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్ల వేళ గ్రామంలో సందడి నెలకొంది. కాగా అమ్మవార్లకు పొంగళ్లుపెట్టి మొక్కులు తీర్చుకుంటే మంచి జరుగుతుందని గ్రామస్థుల నమ్మకం.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: జేఏసీ

కందుకూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సంబంధించిన సమస్యలు పరిష్కారం అయ్యేవరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేయటం జరుగుతుందని జేఏసీ నేతలు తెలిపారు. కందుకూరు డివిజన్‌లోని విద్యుత్ ఉద్యోగుల సమావేశం జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ ఈనెల 6న విశాఖపట్నం, 8న తిరుపతిలలో కార్పొరేట్ ఆఫీసుల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహించి ఈనెల 13న ఛలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. 14న వర్క్ టూ రూల్ కార్యక్రమం ద్వారా నిరసన తెలపటం జరుగుతుందని, అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఈనెల 15 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లటం జరుగుతుం దని తెలిపారు. ఈసమావేశంలో విద్యుత్ శాఖలో వివిధ స్థాయిలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమాల గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న జేఏసీ నేతలు

## మతం ముసుగులో రాజ్యాంగాన్ని మారుస్తున్నారు

**సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోహనరావు**

కావలి (టౌన్) అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మతం ముసుగులో విద్వేషాలు రెచ్చగొట్టేలా రాజ్యాంగంలో మార్పులు తెస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలను విభజించి పాలిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు వంత పాడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు అమలు చేసేలా ప్రజా పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు నగేష్, జీ నాగేశ్వరరావు, శిక్షణా తరగతుల ప్రిన్సిపాల్ సుబ్బరామశర్మ, పట్టణ కార్యదర్శి పెంచల య్య, నాయకులు వెంకయ్య, మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, తిరుపాలు, శైలజ, సుశీల తదితరులు పాల్గొన్నారు.




శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మోహనరావు

## జమునకు 'బెస్ట్ గురు' పురస్కారం

కావలి (టౌన్) అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్రం కరీంనగర్‌లోని ఎస్‌పీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా సంస్థ అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కావలికి చెందిన ఉపాధ్యాయిని ఎం జమునకు నేషనల్ లెవెల్ 'బెస్ట్ గురు' పురస్కారం ప్రదానం చేశారు. సంస్థ నిర్వాహకులు గంగారపు మల్లేశం, రాజ రాజేశ్వరీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ తదితరులు జమునను గోల్డ్ మెడల్, శాలువ, ప్రశంస పత్రంతో సత్కరించారు.



బెస్ట్ గురు అవార్డు అందుకుంటున్న జమున

## టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కావలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త ఆవుల లక్ష్మయ్య కుటుంబ సభ్యులను ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పరామర్శించారు. రూరల్ మండలం అన్నగారిపాలెం పంచాయతీ పెదనట్టుకు చెందిన ఆవుల లక్ష్మయ్య స్కూటర్‌పై వెళుతుండగా శనివారం అర్ధరాత్రి కావలి ట్రంకు రోడ్డులో ఆటో ఢీకొనడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రూరల్ మండలాధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణతో కలిసి గ్రామానికి వెళ్లి లక్ష్మయ్య మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అన్నివిధాల పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట కావలి ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీనుబాబు తదితరులు ఉన్నారు.

## రెడ్‌క్రాస్‌లో పలువురు రక్తదానం

కావలి,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, ప్రజా నాయకుడు అన్నం సుబ్బారావు 13వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కావలి రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో పలువురు ఉపాధ్యాయులతో పాటు, అన్నం సుబ్బారావు కుటుంబ సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం వెంకట హనుమకుమార్ 68వ సారి, బండా వెంకట క్రిష్ణారెడ్డి 11వ సారి, అన్నం కిరణ్ 20వ సారి రక్తదానం చేయటం విశేషం.




## కార్మికుల పనిగంటల పెంపును వ్యతిరేకిస్తాం : సీఐటీయూ

ఉలవపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాలలో కార్మికుల పని గంటలను 8 నుంచి 13 గంటలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాట్టా సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం స్థానికంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వీఆర్‌ఏ, పీటీపీ కార్మికులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లతో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని, దీని కోసం చిరుద్యోగులంతా సమైక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా వీసం విజయ్ కుమార్, కో కన్వీనర్‌గా ఇందిరావతి, కోశాధికారిగా శ్రీదేవి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం ఫీడర్‌లో విద్యుత్ లైనుకు తగిలే చెట్లకొమ్మలు తొలగించటం కోసం సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని తాని కొండవారి కోష్టాలు, రామానాయుడు నగర్, వెంకటాద్రిపాలెం, కనిగిరి రోడ్డు సామిల్లు ఏరియా, బిలాల్‌నగర్, లంబాడిడొంక, దూబగుంట ప్రాంత విద్యుత్ వినియోగదారులు అసౌకర్యాన్ని గుర్తించాలని కోరారు.

## కృత్రిమ అవయవాల కోసం దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సుదీక్షణ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఉచితంగా అందజేస్తున్నందున అవసరమైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుదీక్షణ ఫౌండేషన్ నిర్వాహకురాలు విమల ఈ పరికరాలను ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాల కోసం నవంబరు 9న విజయవాడలోని లెనిన్ సెంటర్ దగ్గర గల అంబేడ్కర్ భవన్‌లో కొలతలు తీసుకోవటం జరుగుతుందని, ఈలోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8985356811 నెంబరులో సంప్రదించాలని కోరారు.

## బోగోలులో మోస్తరు వర్షం

బిట్రగుంట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. మూడురోజులుగా తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం కురవడంతో కాస్త ఉపశమనం లభించింది.

## గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయ ఆవరణలో ఉన్న గంగమ్మతల్లి ఆలయంలో చైర్మన్ పాముల రమణయ్య ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సకాలంలో వరాలు కురిసి గ్రామం పాడిపంటలతో కళకళలాడాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా అంబటి



జిల్లా అధ్యక్షుడి నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఈశ్వర్‌రెడ్డి

వింజమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా అంబటి ఈశ్వర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం నెల్లూరుజిల్లా బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో బీజేపీని బలోపేతం చేయాలన్నారు. మండల అధ్యక్షుడు అంబటి ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మద్దూరి నాగేశ్వర్‌రెడ్డి, గని రమణయ్య, నాయకులు దాసరి ప్రసాద్, డి నారాయణ రెడ్డి, లెక్కమలేని రాజేష్‌నాయుడు, మల్లం కొండారెడ్డి, ఎం వెంకటరెడ్డి, ఎల్ రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో కల్వర్టులు

- డ్రైనేజీ, వర్షపు నీరు వెళ్లక గ్రామస్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



దువ్వూరు పంచాయతీ కార్యాలయం పక్కన శిథిలమైన పంట కాలువ కల్వర్టు

సంగం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వర్టులు శిథిలావస్థకు చేరడంతో వర్షపు నీరు, డ్రైనేజీ నీరు వెళ్లక అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, శిథిలమైన కల్వర్టులను నిర్మించకుండా రహదారి పనులు చేస్తుండడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే డ్రైనేజీ నీటితోపాటు వర్షపు నీరు వెళ్లడం లేదని వాపోతున్నారు. దువ్వూరు గ్రామం మధ్యలో అన్నారెడ్డిపాళెం, మక్తాపురం గ్రామాలకు వెళ్లేందుకు తారు రోడ్డు ఉంది. ఈ రహదారి నిర్మించి చాలా సంవత్సరాలు కావడంతో శిథిలమై అధ్వానంగా తయారైంది. ఈ రహదారిలో పలుచోట్ల పొలాలకు సాగు నీరు ప్రవహించే కల్వర్టులు మూడు, డ్రైనేజీ నీళ్లతోపాటు వర్షపునీరు వెళ్ళేందుకు వేర్వేరు చోట్ల మరో మూడు కల్వర్టులు ఉన్నాయి. దువ్వూరు బ్రాంచి కెనాల్ నుంచి కల్వర్టుల గుండా రహదారికి తూర్పు వైపు ఉండే పొలాలకు పంట కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. అయితే ప్రస్తుతం బోరు పాయింట్‌లు అందుబాటులోకి వచ్చిన తరువాత పంట కాలువల్లో సాగునీరు సరఫరా కావడంలేదు. పంట కాలువలు డ్రైనేజీ కాలువలుగా ఉపయోగపడు తున్నాయి. కాగా, రహదారికి పడమరవైపు ఉన్న నివాసాల నుంచి డ్రైనేజీ నీళ్లతోపాటు, వర్షపునీరు రహదారి దాటి దిగువకు వెళ్లేందుకు అటు సాగునీరు, ఇటు డ్రైనేజీ కాలువలకు కల్వర్టులున్నాయి. ఇవి శిథిలమై అధ్వానంగా ఉన్నాయి. దీనివల్ల వర్షాకాలంలో రహదారికి పడమరవైపు ఉన్న మిట్టపాళెం, ఎస్టీకాలనీ, ముస్లీంపాళెం, గమళ్లపాళెం తదితర ప్రాంతాల నుంచి వర్షపు నీరు శిథిలమైన కల్వర్టుల్లో సరిగా పారక వర్షాకాలం ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**రూ. 2.25 కోట్ల నిధులు మంజూరు**

అధ్వానంగా ఉన్న రహదారితోపాటు కల్వర్టుల మరమ్మతులకు రోడ్డు భవనాల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే కేవలం రహదారి మరమ్మతు పనులకు మాత్రమే రూ. 2.25 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కల్వర్టుల మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. దీంతో కాంట్రాక్టర్ రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో అధికారులు రోడ్డు పనులు చేస్తున్నారు. దీంతో దువ్వూరు రహదారి పడమర వైపు కాలనీలకు భవిష్యత్‌లో ముంపు తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముస్లీంపాళెం వద్ద దెబ్బతిన్న డ్రైనేజీ కల్వర్టు

**కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

శిథిలమైన కల్వర్టుల విషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవితేజను వివరణ కోరగా దువ్వూరు రహదారికి పలుచోట్ల ఉన్న మూడు సాగునీటి కాలువలు, మరో మూడు డ్రైనేజీ నీరు పారే కల్వర్టులు శిథిలావస్థలో ఉన్న మాట వాస్తవమే. రోడ్డుతోపాటు కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. రోడ్డు నిర్మాణానికి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయి. కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో రోడ్డు పనులు చేస్తున్నాం.

## పెళ్లికానుక అందజేత

ఉదయగిరి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేట గ్రామంలో షేక్ అహ్మద్, షరీఫా దంపతుల కుమార్తె షాజిన్ వివాహం సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆదివారం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు జల్సాయాదవ్, హరీష్‌యాదవ్, గంగాధర్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి, క్రమశిక్షణకు మారుపేరు ఆర్‌ఎస్‌ఎస్

సంగం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ శాఖ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా విభ్యావన ప్రచారక్ సావర్కర్ ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది కాలంలో సాధించిన విజయాలు, చేసిన సేవలు వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ అంటే క్రమశిక్షణ, దేశభక్తి, సేవకు మారుపేరని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ ఆపద వచ్చినా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ముందు ఉంటారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



సంగంలో ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాల గురించి వివరిస్తున్న ప్రచారక్ సావర్కర్

## వాల్మీకి జయంతిని విజయవంతం చేయండి

ఆత్మకూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని తిక్కన భవన్‌లో ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు వాల్మీకి జయంతిని నిర్వహించనున్నట్లు వాల్మీకి(బోయ) సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది అశ్వయుజ శుద్ధ పూర్ణిమ నాడు వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. కావున నెల్లూరు నగరంలో నిర్వహించే వాల్మీకి జయంతికి జిల్లాలోని రాజకీయ ప్రతినిధులు, ప్రముఖులు, వాల్మీకి బంధువులు, అన్ని కుల సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఉపాధి హామీ సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాలి

వింజమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో 8290 జాబ్‌కార్డులలో 12402 మంది ఉన్నారు. వీరందరి నుంచి ఉపాధి హామీ సిబ్బంది ఈకేవైసీ సేకరిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలో ఏపీఓ, ఎంపీడీవో పర్యవేక్షించడం జరుగుతుందని శ్రీనివాసరెడ్డి తెలిపారు.


## అడవి పందుల స్వైరవిహారం

- బెంబేలెత్తుతున్న ప్రజలు



నాగులబావి వీధిలో పట్టపగలు చెత్తకుప్పల్లో అడవి పందులు

ఉదయగిరి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా అడవిపందులు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అటవీ ప్రాంతం పట్టణానికి సమీపాన ఉండడం, అడవుల్లో నీటి చుక్క జాడ కనిపించకపోవడంతో పందులు పట్టణంలో సంచరిస్తున్నాయి. పగలు చెత్తకుప్పల్లో తిరుగుతూ ఆకలి తీర్చుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో ఏ వీధిలో చూసినా అడవిపందులు గుంపులుగుంపులుగా సంచరిస్తుండడంతో వాహనదారులు, ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులు పట్టణంలో సంచరించకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.







# కందిపప్పు ఉడికేదెన్నడో?

**● ఈ నెల రేషన్‌లోనూ లేనట్లే**

ఏ నెలకా నెల రేషన్‌లో కందిపప్పు వస్తుందని ఎదురు చూస్తున్న పేదలకు అక్టోబరులోనూ నిరాశే మిగిలింది. ఈ నెల కోటాలోనూ కందిపప్పు రాని పరిస్థితి. రాష్ట్ర స్థాయిలో కందిపప్పు కొనుగోళ్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో డిసెంబరు నుంచి అందజేస్తామని ప్రకటించారు. దీంతో ఈ నెలలోనూ బియ్యం, చక్కెర, రాగులుతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జిల్లాలో 5.81,125 బియ్యం కార్డులుండగా, 450 టన్నుల కందిపప్పు పంపిణీ చేయాలి. వీరికి, ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి కందిపప్పు సరఫరా ఆగిపోయింది. చౌకదుకాణాల్లో కార్డు దారులకు కేవలం రూ.67కే కిలో కందిపప్పు వచ్చేది. బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన కందిపప్పు కిలో రూ.140 వరకు పలుకుతోంది. దీంతో లబ్ధిదారులు రేషన్‌లో ఇచ్చే కందిపప్పు కోసం ఎదురు చూస్తున్నారు.


- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

# ఈ బ్యాటరీ బండ్లు బయటకు తీయండి సారూ!



శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)కు వచ్చే రోగులకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాలు మూలనపడ్డాయి. స్విమ్స్‌కు అనుబంధంగా ఉండే శ్రీపద్మావతి ఆస్పత్రి సెల్లార్‌లో బూజుపట్టి దర్శనమిస్తున్నాయి. వృద్ధులు, వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగుల తరలింపునకు గతేడాది కరూర్ వైశ్యాబ్యాంకు ఐదు బ్యాటరీ వాహనాలను వితరణ చేసింది. 11 సీట్ల సామర్థ్యం ఉన్నవి 4 వాహనాలతో పాటు 14 సీట్ల సామర్థ్యం ఉన్న మరో ఈ-బగ్గీని అందజేసింది. స్విమ్స్ సర్కిల్ నుంచి స్విమ్స్ క్యాజువాలిటీ వరకు రోగులు, కుటుంబ సభ్యులతో ప్రతిరోజు ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు రవాణా చేస్తూ వచ్చారు. కొంత కాలంగా ఈ-బగ్గీస్ పెద్దగా కనిపించడంలేదని ఆరా తీస్తే.. పద్మావతి ఆస్పత్రి సెల్లార్‌లో మూడు వాహనాలు దుమ్ముపట్టి కనిపించాయి. చిన్న రిపేరు రావడంతో పక్కన పెట్టేసినట్టు తెలుస్తోంది. వాల్మీకి సర్కిల్ నుంచి రవాణా చేయకపోయినా స్విమ్స్ ఓపీడీ, క్యాజువాల్టీ నుంచి పద్మావతి ఆస్పత్రి, క్యాన్సర్, డయాలసిస్ సెంటర్ వంటి అంతర్గతంగానైనా బ్యాటరీ వాహనాలను తిప్పాల్సిన అవసరం ఉంది. వాటిని అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



# రైతు భూమికి రాజముద్ర

**జిల్లాకు చేరిన 52,579 కొత్త పట్టాదారు పుస్తకాలు**

**పలు కారణాలతో పెండింగ్‌లో 24,636 పుస్తకాలు**

**మిగిలినవి మండలాలకు తరలింపు**

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): భూమి రైతులది. పాస్‌పుస్తకాలపై బొమ్మ మాజీ సీఎం జగన్‌ది. సరిహద్దు రాళ్లపైనే ఆయన బొమ్మనే చెక్కించుకున్నారు. ఇలా నాటి సీఎం జగన్ ఫొటోల పిచ్చిపై రైతులు ఆగ్రహం.. ఆందోళన వ్యక్తంచేశారు. తాము అధికారంలోకి వస్తే రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలు అందిస్తామని నాడు చంద్రబాబు ప్రకటించారు. ఆ హామీ మేరకు రాజముద్ర, భూయజమాని చిత్రాలతో 52,579 కొత్త పాస్‌పుస్తకాలు జిల్లాకు చేరాయి. వందేళ్ల తర్వాత భూములు రీసర్వే చేస్తున్నట్లు నాడు వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంది. జిల్లాలో 1,048 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 320 గ్రామాల్లో రీసర్వే చేపట్టింది. రైతులకు కనీస సమాచారం లేకుండానే హద్దులు పాతారు. ఆ సర్వే కూడా తప్పుల తడకగా సాగింది. ఇది రైతుల మధ్య వివాదాలకు దారి తీసింది. పల్లెల్లో భూ పంచాయితీలు పెరిగాయి. ఇవేవీ పట్టించుకోకుండానే నాటి ప్రభుత్వం హడావిడిగా 52,579 మంది రైతులకు భూహక్కు పత్రాలను జారీ చేసింది. జగన్ ఫొటోతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. చివరకు రీసర్వే చేసిన ప్రాంతాల్లో హద్దురాళ్లపైనా జగన్ బొమ్మను చెక్కడంపైనా రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి వచ్చాక.. ఎన్నికల హామీ మేరకు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో తప్పులను సరిచేసింది. రాజముద్ర, భూయజమాని ఫొటో, పూర్తి వివరాలతో కొత్తపట్టాదారు పుస్తకాలను తీసుకొచ్చింది. రీ సర్వే జరిగిన 320 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 52,579 పాసుపుస్తకాలు తిరుపతికి చేరాయి. వీటిలో చిన్నచిన్న తప్పిదాలు, మృతి చెందినవారివి, నోషనల్ ఖాతాలు ఉన్న 24,636 పాసుపుస్తకాలను పెండింగ్‌లో ఉంచారు. మిగిలిన 27,942 పట్టాదారు పాసుపుస్తకాలను కలెక్టరేట్ నుంచి ఆయా తహసీల్దారు కార్యాలయాలకు పంపించారు. త్వరలో భూయజమానులకు వీటిని పంపిణీ చేస్తామని డీఆర్వో నరసింహులు తెలిపారు. మిగిలిన వారికి త్వరలో నూతన పట్టాదారు పాసుపుస్తకాలు అందనున్నాయి.



'నియోజకవర్గంలోని కొందరు మద్యం దుకాణదారులు, భూదందాలు చేసిన వారు పైరవీల కోసం నావద్దకు వచ్చారు. వారిని నిర్మొహమాటంగా తిరిగి పంపించేశా. ఇలా ఏడాది పాటు నా వద్దకొచ్చిన వ్యవహారాలను తిప్పికొట్టా. ఇలాంటి అంశాల్లో గతంలో రోజా రూ.కోట్లు సంపాదించారు. నేను అవినీతి అక్రమాలకు తావివ్వను. ఎవరైనా నా పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించను.

- ఎమ్మెల్యే భానుప్రకాష్

# 160 మంది.. రూ.1.32 కోట్లు

**● నగరిలో 'సీఎంఆర్‌ఎఫ్' చెక్కుల పంపిణీ**

నగరి నియోజకవర్గంలోని 160 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద రూ.1,32,34,595 మంజూరయ్యాయి. ఈ చెక్కులను ఆదివారం నగరిలోని టీడీపీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పంపిణీ చేశారు. చంద్రబాబు సీఎం అయ్యాక అర్హులైనవారందరికీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వైద్య ఖర్చులను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమావేశంలో నగరి నేతలతో పాటు పుత్తూరు మున్సిపల్ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, మండల అధ్యక్షుడు అరవ బాలాజీ, ధనంజయనాయుడు, రమేష్‌రాజు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు చిట్టి, నగరి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజి తదితరులు పాల్గొన్నారు.

- నగరి, ఆంధ్రజ్యోతి



# కురవ, కురబ సంక్షేమానికి కృషి

**● తిరుపతిలో భక్త కనకదాస విగ్రహావిష్కరణలో మంత్రి సవిత**

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : కురవ, కురబల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తిరుపతి పూర్ణ కుంభం సర్కిల్ వద్ద ఆదివారం భక్తకనకదాస విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. రామతులసి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం భక్తకనకదాసు విగ్రహాన్ని వితరణగా ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. తిమ్మప్ప భక్తకనకదాసుగా మారిన విధానాన్ని వివరించారు. అపారమైన భక్తితో వెంకటేశ్వరస్వామి అనుగ్రహం పొందిన భక్తాగ్రేసరుడని పేర్కొన్నారు. కురవ, కురబ కమ్యూనిటీ భవన నిర్మాణానికి అనవరమైన స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ భక్తకనకదాసు భక్తికి వెంకటేశ్వరస్వామి మెచ్చి తనకు సమర్పించిన వస్త్రాన్ని ఆయనకు స్వయంగా అలంకించారని తెలిపారు. అటువంటి భక్తా శ్రేష్ఠుడి కాంస్య విగ్రహం తిరుపతిలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కర్ణాటక మాజీ మంత్రి, ఎమ్మెల్యే రేవన్న మాట్లాడుతూ కమ్యూనిటీ భవన నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ కురవ, కురబల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. బెంగుళూరులోని కనకదాసు మఠం పీఠాధిపతి సిద్ధరామానంద స్వామి మాట్లాడుతూ భక్తి ఎక్కడుంటే కనకదాసు అక్కడుంటారని తెలిపారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడారు. అంతకు ముందు బాలాజీ కాలనీలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, ర్యాలీగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పూర్ణకుంభం సర్కిల్ వద్దకు చేరుకున్నారు. కురవ, కురబ సంఘం నేతలు, విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భక్తకనకదాస విగ్రహావిష్కరణలో మంత్రులు, ఎమ్మెల్యేలు

# విలువలతో కూడిన బోధన ప్రథమ కర్తవ్యం

**● నూతన ఉపాధ్యాయులకు డీఈవో దిశానిర్దేశం**

తిరుపతి(విద్య), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మానవతా విలువలతో కూడిన ఉత్తమ బోధన అందించడం ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యమని డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. మెగా డీఎస్సీలో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులకు తిరుపతి రూరల్ దుర్గసముద్రంలోని మెడ్‌జీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణను ఆదివారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో అత్యంత బాధ్యతాయుతమైనదంటూ ఉపమానాలతో వివరించారు. అందుకు అనుగుణంగా తమను తాము మలచుకోవాలని సూచించారు. జాతీయ విద్యా విధానం 2020- నిపుణ్ భారత్‌లో భాగమైన ఎఫ్‌ఎల్‌యన్ గ్యారంటీడ్ శిక్షణను సద్వినియోగం చేసుకుని బోధనలో నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ప్రతి పిల్లవాడి సర్వతోముఖాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తిరుపతి ఉప విద్యాశాఖాధికారి ఇందిరా దేవి, ఎంఈవోలు భాస్కర్ బాబు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు, డాక్టర్ సుధాకర్, పద్మావతి, భువనేశ్వరి, రిసోర్స్ పర్సన్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో కుమార్

## నేడు పోలీస్ పీజీఆర్‌ఎస్ రద్దు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్‌ఎస్ కార్యాక్రమాన్ని ఈ రోజు (6వ తేది) రద్దు చేస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతికి ప్రముఖుల రాక సందర్భంగా రద్దు చేశామని పేర్కొన్నారు. ప్రజలు ఎస్పీ కార్యాలయానికి రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని కోరారు.

## విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

సత్యవేడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందాడు. ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాలు... మండలంలోని ఏఎంపురానికి చెందిన ట్రాన్స్‌కో ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి విధుల్లో బాగంగా శనివారం సాయంత్రం బాలకృష్ణాపురంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుబ్రమణ్యం రెడ్డి భార్య రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సుబ్రమణ్యం రెడ్డికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.



సుబ్రహ్మణ్యం రెడ్డి (ఫైల్)

## నేడు, రేపు తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు సీటీఎస్ ఏటీఎం భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 4 నుంచి మంగళవారం ఉదయం 9 గంటల వరకు ప్రతి అరగంటకు ఓ బస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు.

## నలుగురు రైల్వే ఉద్యోగుల సస్పెన్షన్

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పాకాల- పూతలపట్టు రైలు మార్గంలో ఇటీవల మరమ్మతులు చేస్తుండగా ఓహెచ్ఈ కార్ పట్టాలు తప్పిన ఘటనలో నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్‌గుప్తా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ విభాగం జేఈ ఉదయభాను, మేస్త్రీ సన్యాసరావు, గ్యాంగ్‌మెన్ షణ్ముగంతో పాటు ఓహెచ్ఈ కార్ డ్రైవర్‌ను ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## నేడు మంత్రి నారా లోకేశ్ రాక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం జిల్లాకు రానున్నారు. ముంబై నుంచి సోమవారం రాత్రి 11.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన చంద్రగిరి మండలం నారావారిపల్లెలోని స్వగృహానికి చేరుకుంటారు. మంగళవారం ఉదయం 8.45 గెడ్డంవారిపల్లె గ్రామానికి చేరుకుని ఇటీవల మృతిచెందిన టీడీపీ నేత సుబ్రహ్మణ్యంనాయుడు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. తిరిగి 9.45 గంటలకు నారావారిపల్లెకు చేరుకుంటారు. తన కుటుంబసభ్యులతో కలిసి బాబాయి రామ్మూర్తినాయుడు 11వ నెల విస్తరి కార్యక్రమంలో పాల్గొంటారు. 3 గంటలకు సీఎం చంద్రబాబుతో కలిసి హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరి వెళ్లనున్నారు.

## తిరుపతిలో నీలిట్ కేంద్రం



ప్రారంభ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, వీసీ అప్పారావు, ఎంపీ గురుమూర్తి

**● వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్**

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జాతీయ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక సంస్థ (నీలిట్) కేంద్రం ప్రారంభమైంది. ఎస్వీ యూనివర్సిటీలో ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన తాత్కాలిక కేంద్రాన్ని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఎంపీ గురుమూర్తి, జేసీ శుభం బన్సల్, ఎస్వీయూ వీసీ అప్పారావు తదితరులు స్థానికంగా హాజరయ్యారు. ఈ కేంద్రం ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించేందుకు మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆధునిక ఐటీ, సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ రంగంలో అవసరమైన శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. సమాచార సాంకేతికత (ఐటీ), వెబ్ డిజైనింగ్, పీసీ హార్డ్‌వేర్ అండ్ నెట్ వర్కింగ్, ఆఫీస్ ఆటోమేషన్, అకౌంటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

## రూ.10వేల కోట్లతో మున్సిపాలిటీల అభివృద్ధి

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అమృత్ పథకం ద్వారా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, కురుగొండ రామకృష్ణతో కలిసి మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. గూడూరు మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు అమృత్ పథకం కింద రూ.73 కోట్లు మంజూరయ్యాయన్నారు. డ్రైన్లను అభివృద్ధి పరిచేందుకు రూ.28 కోట్లు మంజూరు చేస్తామన్నారు. అలాగే, సూళ్లూరుపేట మున్సిపాలిటీకి రూ.218 కోట్లు, నాయుడుపేటకు రూ.173 కోట్లు, వెంకటగిరికి రూ.120 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మున్సిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు, ఫజులుల్లా, చిన్నయ్య, వెంకట్రామిరెడ్డి, నాయకులు శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, మట్టం శ్రావణి, గురవయ్య, నరసింహులు, శ్రీధర్, కల్పన, భారతి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

## గూడూరు సబ్‌కలెక్టర్ బదిలీ

**● ఏజీఎంయూటీ క్యాడర్‌కు రాఘవేంద్ర మీనా**



గూడూరు అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా అరుణాచల్‌ప్రదేశ్ - గోవా - మిజోరాం, కేంద్రపాలిత ప్రాంతాల(ఏజీఎంయూటీ) క్యాడర్‌కు బదిలీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన మీనా గతేడాది సెప్టెంబరు 7వ తేదీన గూడూరు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కొద్దినెలల క్రితం ఏజీఎంయూటీ క్యాడర్ ఐపీఎస్ అధికారిణి సులేఖా జగర్వార్‌తో ఆయనకు వివాహం అయ్యింది. దీంతో ఆదే క్యాడర్‌కు తనను బదిలీ చేయాలంటూ మీనా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంతో రాఘవేంద్ర మీనాను ఏజీఎంయూటీ క్యాడర్‌కు బదిలీ చేస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో రోజుల్లో సబ్‌కలెక్టర్ రిలీవ్ కానున్నారు.

## వైభవంగా నాగలింగేశ్వరస్వామి నగరోత్సవం


నాగలింగేశ్వరస్వామి నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖినది తీరాన వెలసిన్న ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాగలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి రెండవ రోజు ఆదివారం ఉదయం ప్రధాన కలశారాధన, అగ్ని ప్రతిష్ఠ, ప్రత్యేకహోమాలు, మహాస్నపనం నిర్వహించారు. సాయంత్రం మంగళవాయిద్యాల, మంత్రోచ్చరణల నడుమ నాగలింగేశ్వరస్వామి వైభవంగా నగరోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, గురుస్వామి బాలాజీ, రాధయ్య, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, అవధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## బకాయిలను వెంటనే చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రావు

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. 11వ పీఆర్సీ, 24నెలల బకాయిలు, పెండింగ్ డీఏలు తదితర బకాయిలను చెల్లించాలన్నారు. లేని పక్షంలో పోరాలు సాగించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, వైవీ నారాయణ, సుబ్రహ్మణ్యంరాజు, మురగమ్మ, విజయ్ కుమార్, చంద్ర, మస్తాన్, సుబ్బారావు, వెంకటేశులు, జిలానీ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించండి


మంత్రి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న జనసేన నేత చంద్రశేఖర్

గూడూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఆదివారం గూడూరుకు విచ్చేసిన మంత్రి నారాయణకు జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో సిబ్బంది కొరత వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పట్టణంలో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, చెరువుకట్టను సుందరీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోహన్, నాగార్జున, విజయ్, బీజేపీ నాయకుడు ఆరికట్ల బాలకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులందరికీ వేతనాలను పెంచడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. చనిపోయిన కార్మికుల కటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, మురళి, శివకుమార్, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం

సూళ్లూరుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, పక్కన ఎంఈఓ సునీల, ప్రధానోపాధ్యాయురాయులు మృదుల తదితరులు

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎంబేటి శ్రీనివాసులు, శ్రీపతి సురేంద్ర, మారం కృష్ణమూర్తి, నెల్లూరు భవానీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సునీల, ప్రధానోపాధ్యాయులు మృదుల, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి అరుణకుమారి, కోశాధికారి జానకి, ప్రాజెక్టు చైర్మన్ వసుంధర, సభ్యులు మధుసూదనరెడ్డి, రాధాకృష్ణరావు, తాడిపర్తి ఆదినారాయణరెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

తడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లిన ఘటన తడ రైల్వేస్టేషన్ దక్షిణ క్యాబిన్ రైల్వే గేట్ వద్ద శనివారం రాత్రి జరిగింది. మండల పరిధిలోని పూడికుప్పం గ్రామానికి చెందిన రజియా తడ కొత్తకుప్పంలోని బంధువుల ఇంటికి నడచి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారు సరుడు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ ఆదివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న రెడ్ సంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్‌క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావస రాలను అందజేశారు. కార్యక్రమంలో మాధురి, లక్ష్మి, జీవని, జానా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య ఆధ్వర్యంలో ఆధునికీకరణ పనులు చేపట్టిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ జనార్ధనరెడ్డి, శిరోమణిశర్మ, శివకుమార్, రామ్మూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### ఐదుగురి అరెస్టు

### రూ.34,650 నగదు, 3 బైక్‌ల స్వాధీనం

డక్కిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) డక్కిలి శివారు ప్రాంతంలోని అడవిలో పేకాట స్థావరంపై ఎస్‌ఐ శివశంకర్ తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, రూ.34,650 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

బాలాయపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయంపు, మన్నూరు గ్రామాల్లో సోమవారం నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పీఆర్వో నందకిశోర్ తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మన్నూరు, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జయంపులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## డక్కిలిలో నేడు ఎమ్మెల్యే పర్యటన

డక్కిలి, అక్టోంబరు 5 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం దేవునివెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని సోమవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు తెలిపారు. కుప్పాయపాళెంలో గోకులం షెడ్ల ప్రారంభోత్సవం, సీసీ రోడ్లకు భూమిపూజ ఎమ్మెల్యే చేతుల మీదుగా జరుగుతాయని చెప్పారు.

# జాతీయ రహదారిపైనే చెత్త

**డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించినా కలగని మోక్షం ● కొరవడిన ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవ**


జాతీయ రహదారిపై పోసిన చెత్త

సూళ్లూరుపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డు సమస్యకు ఇప్పట్లో పరిష్కారం లభించేలాలేదు. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని 25వార్డుల్లో 58 వేల పైగా జనాభా ఉంది. రోజుకు దాదాపు 22 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. మూడు దశాబ్ధాలుగా హోలిక్రాస్ సమీపంలోని జాతీయ రహదారిపై పక్కనే ఉన్న కాళంగి నది ఒడ్డున డంపింగ్ యార్డులో చెత్త వేస్తున్నారు. ఇక్కడ దాదాపు 38,261 టన్నులు చెత్త పేరుకుపోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పట్టణాల్లో ఎక్కడ చెత్త, వ్యర్థాలు కనబడకూడదనే ఉద్దేశంతో బయోమైనింగ్ ద్వారా శుద్ధి చేయడం ప్రారంభించారు. దీని ద్వారా సాలిడ్స్, మెటల్, ప్లాస్టిక్‌ను వేరుచేసి బయటకు తరలిస్తున్నారు. ఈ ప్రక్రియ సైతం పూర్తయ్యింది. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో ఉత్పత్తి అయ్యే చెత్తను పోసేందుకు కొణ్ణంబట్టు వద్ద పది ఎకరాల స్థలాన్ని డపింగ్ యార్డుకు కేటాయిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆ భూముల్లో చెత్త వేయరాదంటూ స్థానికులు అభ్యంతరం చెప్పారు. దీంతో డంపింగ్ యార్డు సమస్య మొదటికొచ్చింది. మున్సిపాలిటీ అధికారులు చేసేదేమీ లేక సూళ్లూరు సమీపంలో వాటంబేడు రోడ్డులో కాళంగి నది అంచునే చెత్తను వేస్తూవచ్చారు. అక్కడి ప్రజలు అభ్యంతర చెప్పడంతో ప్రస్తుతం బయోమైనింగ్ చేస్తున్న డంపింగ్ యార్డు జాతీయ రహదారిపైనే చెత్త పోస్తున్నారు. నిబంధనల ప్రకారం బయో మైనింగ్ చేస్తున్న స్థలంలో చెత్త వేయరాదని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు హెచ్చరికలు జారీ చేశారు. మున్సిపాలిటీ అధికారులు గత్యంతరం లేక అక్కడే చెత్త పోయడంతో జాతీయ రహదారిపైనే కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులకు ముందుచూపు లేకపోవడంతో డంపింగ్ యార్డుకు కలెక్టర్ కేటాయించిన స్థలాన్ని సమీప గ్రామస్థులతో మాట్లాడి వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలం చెందారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దినదిన అభివృద్ధి చెందుతున్న సూళ్లూరుపేట పట్టణానికి డంపింగ్ పెద్ద సమస్యగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు


కరపత్రాలను అందజేసి అవగాహన కల్పిస్తున్న నరసింహయాదవ్, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టవర్ క్లాక్‌సెంటర్, ముత్యాలపేట ప్రాంతాల్లో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించడంతో పలు వస్తువుల ధరలు తగ్గాయన్నారు. ప్రధానంగా నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్స్, వాహనాలు, రైతులకు వ్యవసాయ పరికరాలు ఇలా ఎన్నో వస్తువులు గతం కంటే తక్కువ ధరలకు లభ్యవవుతున్నాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా జీఎస్టీని తగ్గించడం జరిగిందన్నారు.అనేక సంక్షే మ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకెళుతున్న ఎన్డీఏ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, మట్టం శ్రావణి, బిల్లు చెంచురామయ్య, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, గుండాల లీలావతి, పెంచలయ్య, శ్రీదేవి, వాటంబేడు శివకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు రమేష్, శ్రీధర్, మాధవనాయుడు తదితరులు

సూళ్లూరుపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 11 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.16,59,949 మంజూరైంది. ఆ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నెలవల విజయశ్రీ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, బెస్తకార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్, రైతు సూళ్లూరుపేట, తడ సొసైటీల అధ్యక్షులు ఏజీ కిషోర్, వేనాటి శ్రీకాంత్ రెడ్డి, టీడీపీ నాయకులు మాధవనాయుడు, బొమ్మన్ పళణి, శెల్వం, అలవల శ్రీనివాసులు, మునస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత ధనుంజయరెడ్డి తల్లి మృతి


నవనీతమ్మ (ఫైల్‌ఫొటో)

ఓజిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం మానమాలకు చెందిన టీడీపీ నేత, కురుగొండ సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎద్దల ధనుంజయరెడ్డి తల్లి నవనీతమ్మ(82) ఆదివారం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న పలువురు టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకులు మానమాల గ్రామానికి వెళ్లి నవనీతమ్మ మృతదేహానికి నివాళులర్పించి ధనుంజయరెడ్డిని పరామర్శించారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## పేదలకు దుస్తుల పంపిణీ


పేదలకు దుస్తులు అందజేస్తున్న పెంచలనాయుడు

గూడూరు అర్బన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ శత వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక బాలాజీనగర్ సెంటర్ వద్ద భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా వైస్‌ప్రెసిడెంట్ కంకణాల పెంచలనాయుడు ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

## నారాయణమ్మకు ప్రత్యేక పూజలు


గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సొసైటీ కాలనీలోని నారాయణమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

## రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ పవన్‌కుమార్

కోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పవన్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం కోట పోలీసుస్టేషన్ ప్రాంగణంలో మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు పార్టీలకు అతీతంగా అందరితోనూ సఖ్యతగా మెలగాలన్నారు. ఎక్కడా వివాదాలకు వెళ్లకూడదని, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో నిఘా పెంచుతామని, ఎక్కడైనా తేడా వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ స్పష్టం చేశారు.

## కోటమ్మకు పూజలు



కోట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## జగన్‌ను కలిసిన కలిమిలి

డక్కిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకుడు, వైసీపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కలిమిలి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనను పార్టీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## సూపర్ సిక్స్‌తో పేదల జీవితాల్లో వెలుగు


సమావేశంలో మాట్లాడుతున్న కేవీనాయుడు

పెళ్లకూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు పాలనలో అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని చిల్లకూరు సొసైటీ అధ్యక్షుడు కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడు అన్నారు. ఆదివారం ఆయన రావులపాడులో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులను తన అనుభవంతో అధిగమించి సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో పరుగులు పెట్టిస్తున్న ఘనత చంద్రబాబు నాయుడికే దక్కుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

## 7 నుంచి ఫ్రెండ్‌షిప్ క్రికెట్ పోటీలు


టీషర్ట్‌లను ఆవిష్కరిస్తున్న క్రీడాకారులు

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో 7నుంచి 9వ తేదీ వరకు ఫ్రెండ్‌షిప్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నామని నిర్వాహకుడు టీఆర్ మణి తెలిపారు. ఆదివారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రికెట్ పోటీలకు సంబంధించిన టీషర్ట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గూడూరులో క్రికెట్ ఆడుతూ వివిధ వృత్తుల్లో పలు ప్రదేశాల్లో స్థిరపడి ఉన్నవారిని ఒక చోటకు చేర్చి స్నేహభావ వాతావరణంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండ్ల సురేష్‌బాబు, కరిముల్లా, దీపక్‌ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన మహిళా సంక్షేమ సంఘ ప్రతినిధులు

గూడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించేందుకు ఆదివారం గూడూరుకు వచ్చిన మంత్రి నారాయణ ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీలను బలిజ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సారగం సులక్ష్మి, సారంగం శ్రీనివాసులు, పద్మావతి, సువర్ణలక్ష్మి, ఉమాదేవి, ఎంవీ రమణయ్య, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

## శ్రీనివాస్‌కు డాక్టరేట్



బాలాయపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం గ్రామానికి చెందిన సాధనాల శ్రీనివాస్‌కు శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పొందారు. వెంకటగిరి పట్టణంలోని ఈఎస్ఎస్ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ శ్రీకృష్ణదేవరాయ యూ నివర్శిటీ మేనేజ్మెంట్ విభాగం ప్రొఫెసర్ సీఎస్ కృష్ణ నాయక్(రిటైర్డ్) మార్గదర్శకత్వంలో 'డిజిటల్ బ్యాంకింగ్‌లో యూపీఐల పాత్ర' అనే అంశంపై పరిశోధన చేశారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ జనశక్తి విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్(జనసేన అనుబంధం) నాయకులు ఎ.సుధాకర్, టి.అశోక్‌కుమార్ తెలిపారు. తిరుపతి ఏపీఎస్ఈబీ ఇంజనీరింగ్ అసోసియేషన్ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి నాయకులు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి ఉద్యోగుల సమస్యలపై పోరాటానికి సంఘం సిద్ధంగా ఉంటుందని చెప్పారు. కాంట్రాక్టు, రెగ్యులర్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు పవన్‌కుమార్, ఇ.వెంకటాద్రి, శ్రీరామ్ మల్లికార్జున, సోమశేఖర్, జి.రమేష్‌బాబు, కేవీ ప్రసాద్, మునిరామకృష్ణ పాల్గొన్నారు.

# చూపులేకున్నా.. తగ్గేదే లే..

- స్కేటింగ్‌లో దూసుకువెళ్తున్న హర్షవర్ధన్
- అసమాన ప్రతిభతో ఓ బాలుడి సాహస విన్యాసం
- ప్రపంచ రికార్డు సాధన దిశగా సన్నాహం


రోడ్డుపై స్కేటింగ్ చేస్తున్న హర్షవర్ధన్



తల్లితో మునిచరణ్, హర్షవర్ధన్

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పేదరికం, అంధత్వం.. ఇవేమీ ఆ పదకొండేళ్ల కుర్రాడికి అడ్డం కాలేదు. కాళ్లకు చక్రాలు కట్టుకుని దూసుకుపోతున్నాడు. 'నీ ధైర్యాన్ని దర్శించి దైవాలే తలదించగా' అని ఓ సినిమా కవి అన్న మాటల్ని నిజం చేస్తున్నాడు. స్కేటింగ్‌లో విశేష ప్రతిభ కనబరుస్తూ ప్రపంచ రికార్డు సృష్టించడానికి సన్నద్ధమవుతున్నాడు హర్షవర్ధన్. ఏర్పేడు మండలం మహంకాళీదేవి పుత్తూరు(ఎండీ పుత్తూరు)కు చెందిన రాజకుమారి, మునిబాబు దంపతులది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. మొదటి కుమారుడు మునిచరణ్‌కు మూగ, చెముడు. రెండో కుమారుడు హర్షవర్ధన్ అంధత్వంతో జన్మించాడు. ఇద్దరు దివ్యాంగులే పుట్టారంటూ భర్త చికాకుపడేవాడు. బంధువులూ ఈసడించుకునేవారు. అయినా రాజకుమారి ఇసుమంత బాధను కూడా దరిచేరనివ్వలేదు. ఓ ప్రయివేట్ స్కూలులో ఆయాగా చేస్తూ బిడ్డలిద్దరినీ కంటికి రెప్పగా సాకుతోంది. తిరుచానూరు రోడ్డులోని నవజీవన్ పాఠశాలలో చేర్పించింది.

### చూపులేని స్కేటింగ్ లక్ష్యం

నవజీవన్‌లో కోచింగ్ ఇస్తున్న టాలెంట్ స్కేటింగ్ అకాడమీ(పుత్తూరు) కోచ్ ప్రతాప్ దృష్టి హర్షవర్ధన్‌పై పడింది. అతని ఉత్సాహానికి ముచ్చటపడి తానే కిట్లు, ఇతర సామగ్రిని సమకూర్చారు. చూపులేకుండా స్కేటింగ్ చేయడం సాహసం, ప్రమాదమని తెలిసినా హర్షవర్ధన్ కూడా ఎక్కడా తగ్గలేదు. కఠోర పరిస్థితులను అధిగమిస్తూ శిక్షణ పొందాడు. నెల రోజుల్లోనే ప్రాథమిక మెలకువలను నేర్చేశాడు. బాలుడి ప్రతిభను ప్రతాప్ గ్రహించి తనతో తీసుకువెళ్లి నాలుగు నెలలుగా తర్ఫీదునిస్తున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పుత్తూరు నుంచి నాగలాపురం వరకూ రానూపోనూ స్కేటింగ్ సాధన చేస్తున్నాడు. అంటే దాదాపు 50కిలోమీటర్ల దూరాన్ని అలుపు లేకుండా ఛేదిస్తున్నాడు. రోడ్డు అంచుల్లో వేసిన తెల్లటిరంగుపై స్టిక్‌తో రాసుకుంటూ ముందుకు కదులుతున్నాడు. గంటకు దాదాపు 20కిలో మీటర్ల వేగంతో వెళ్తున్నాడు. గురువు ప్రతాప్ వెనుకనే కారులో అనుసరిస్తూ సూచనలిస్తున్నాడు.

### ప్రపంచ రికార్డుకు సన్నాహాలు

గ్లోబల్, వజ్ర, హిందూస్థాన్, వండర్‌వరల్డ్, జీనియస్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సంస్థలకు హర్షవర్ధన్ వీడియోలను పంపారు. వారినుంచి అంగీకారం లభించింది. త్వరలో జరిగే పోటీకి తేదీ ఖరారు కాలేదు. ఈ ఆరు సంస్థల ప్రతినిధుల పర్యవేక్షణలో ఆంధ్రా, కర్ణాటక సరిహద్దు నంగిలి చెక్‌పోస్టు వద్ద బయల్దేరి చిత్తూరు, తిరుపతి, వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు, నాగాలాపురం, పుత్తూరుకు(220కిలోమీటర్లు) స్కేటింగ్ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పాలనే లక్ష్యంగా హర్షవర్ధన్‌కు శిక్షణ ఇచ్చానని కోచ్ తెలిపారు. పోటీ జరిగే రోజు ఉదయం 6గంటలకు బయల్దేరితే రాత్రి 11గంటలకు స్కేటింగ్ ముగిస్తుందని భావిస్తున్నారు.

### ఇద్దరూ ఉన్నతంగా బతకాలనేది ఆకాంక్ష

తిరుపతిలోని ఆకుతోటవీధిలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. రోజు నేను పనిచేసే స్కూల్‌వ్యాన్‌లోనే పిల్లలను తీసుకెళ్లి, తీసుకువస్తాను. 2016లో సీఎం చంద్రబాబు అందించిన దాదాపు రూ.10లక్షలతో పెద్దకుమారుడికి చెవి యంత్రం అమర్చగలిగాం. పిల్లలిద్దరికీ దివ్యాంగుల పింఛను ఆసరాగా నిలుస్తోంది. విధి వెక్కిరించినా ఇద్దరూ గొప్పగా బతకాలని కోరుకుంటున్నాను. మంచి భవిష్యత్తు అందివ్వాలని తపన పడుతున్నాను. ఆధారం లేకుండా స్వశక్తితో బతకాలనుకుంటున్నాడు. నా ఆకాంక్ష నేరవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

- రాజకుమారి, హర్షవర్ధన్ తల్లి